www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 10 | 12-6-2026 | శుక్రవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |

## ఫ్యూచర్ సిటీ వంద శాతం రద్దు చేస్తాం

- మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచారు
- పదుల కోట్లతో ముఖ్యమంత్రి విలాసవంతమైన భవనం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు ఫైర్

2

ఫ్యూచర్ సిటీని తాము వంద శాతం రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.



## 'దోపిడీ సర్కార్!'

- తరుగు, రవాణా పేరుతో రైతుల నుంచి భారీ లూటీ
- ఉచిత విద్యుత్‌కు ఎసరు పెడుతున్న రేవంత్ ప్రభుత్వం
- ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన కవిత



2

## 'దొంగ ఓట్లు తీసేస్తే భయమా?'

- విపక్షాల తీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఫైర్
- ఎస్ఈఆర్ ప్రక్రియపై బురదజల్లడం సరికాదని హితవు



# దేశాభివృద్ధికి విద్యే పునాది!

**చదువుతోనే వెనుకబాటుకు చెక్!**

*నీతి ఆయోగ్ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్*



### ఆరు నగరాల కోసం ఎం-6 టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదన

- ఒక్కో నగరానికి ఆరు లక్షల కోట్లు ఇవ్వాలన్న రేవంత్
- కేంద్రం ముందు తెలంగాణ అభివృద్ధి నమూనా
- మూసీ, ఫ్యూచర్ సిటీలకు సహకరించాలని విజ్ఞప్తి
- సమావేశం అనంతరం ప్రధాని మోదీతో భేటీ
- ప్రాజెక్టుల అనుమతులపై చర్చ

2

దేశ ఆర్థిక ప్రగతికి చోదక శక్తులుగా ఉన్న ఆరు ప్రధాన నగరాల అభివృద్ధికి తలా ఆరు లక్షల కోట్ల రూపాయలతో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. గురువారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న ఆయన.. తెలంగాణ అభివృద్ధి నమూనాను దేశం ముందుంచారు. సామాజిక వెనుకబాటును పారద్రోలేందుకు రాష్ట్రంలో చేపట్టిన 'యంగ్ ఇండియా' పాఠశాలలను పరిశీలించేందుకు రావాలని దేశవ్యాప్త నేతలకు బహిరంగ ఆహ్వానం పలికారు. సమావేశం అనంతరం ప్రధానితో ప్రత్యేకంగా భేటీ అయి రాష్ట్ర ప్రాజెక్టులకు నిధులు, అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

- న్యూఢిల్లీ, జూన్ 11




- 'వికసిత్ భారత్'పై నీతి ఆయోగ్ చారిత్రాత్మక మంథనం!
- ప్రతి పౌరుడి జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
- ప్రధాని అధ్యక్షతన గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం
- సమగ్ర మానవాభివృద్ధి, నైపుణ్యాలు, ఉపాధి, ఆరోగ్య రంగాలపై చర్చ

4

## 2047 నాటికి నవభారత నిర్మాణం

దేశాన్ని 2047 నాటికి సంపూర్ణ అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే చారిత్రాత్మక లక్ష్యంతో 'నీతి ఆయోగ్' గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ ఉన్నత స్థాయి భేటీలో సమగ్ర మానవాభివృద్ధి, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ప్రజల సంక్షేమ కార్యక్రమాలే అజెండాగా విస్తృతంగా మంథనం చేశారు. ఈ ఏడాది సదస్సుకు "వికసిత్ భారత్-2047 కోసం సమగ్ర మానవాభివృద్ధి" అనే ప్రధానాంశాన్ని ఎంచుకున్నారు. వయస్సు, ప్రాంతం, లింగం, సామాజిక, ఆర్థిక పరిస్థితియోంలతో సంబంధం లేకుండా దేశంలోని ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే విప్లవాత్మక విధానాలపై ఈ సందర్భంగా ప్రత్యేక దృష్టి సారించారు.

- న్యూఢిల్లీ, జూన్ 11




## ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి

కాల్పుల్లో ముగ్గురు నావికుల మృతి

ధ్రువీకరించిన మంత్రి

4




## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- అందుబాటులో మార్కుల మెమోలు
- పరీక్ష రాసిన నాలుగు లక్షల మంది
- వేగంగా ముగిసిన మూల్యాంకనం
- ఏమాత్రం జాప్యం లేకుండా ప్రకటన



ఉద్యమ కెరటం
తెలుగు దినపత్రిక



# ఫ్యూచర్ సిటీ వంద శాతం రద్దు చేస్తాం

**ఫార్మా భూముల్లో రియల్ వ్యాపారమా?**

**ప్రత్యామ్నాయ స్థలాలు జర్నలిస్టులకు ఇవ్వాలి**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు ఫైర్**




**హైదరాబాద్:** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీని బీఆర్ఎస్ వంద శాతం రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ పేరుతో సేకరించిన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడితే చట్టం ఊరుకోదని హెచ్చరించారు. ఫ్యూచర్ సిటీలో వివాదాస్పద భూములు కాకుండా జర్నలిస్టులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాల వల్ల డెబ్బై వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు వెనక్కి పోయాయని హరీష్ రావు విమర్శించారు. ఫార్మా సిటీని రద్దు చేసి భూములను రైతులకు తిరిగిస్తామని గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తుచేశారు. ఫార్మా సిటీ కోసం తాను కూడా పదిహేడు ఎకరాల భూమి ఇచ్చానని, ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వాడితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తే తాము వ్యతిరేకించబోమని, అయితే వివాదాలు లేని ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వెనుక సొంత పార్టీ నేతల హస్తం ఉందని హరీష్ రావు ఆరోపించారు. ఆమెపై ఉన్న కేసు వివరాలను తెలంగాణకు చెందిన ఓ వ్యక్తే మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రులకు లీక్ చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి సూచించిన వ్యక్తికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వకపోవడం వల్లే ఆయన అనుచరుడే ఈ పని చేశాడని ఆరోపించారు. ఈ కుట్రపై ముఖ్యమంత్రి సిట్ లేదా జ్యుడీషియల్ విచారణ వేస్తారా అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసం సమీపంలో వంద కోట్ల ప్రజాధనంతో 'బోధి పెవిలియన్' పేరిట విలాసవంతమైన ఇల్లు నిర్మించుకుంటున్నారని హరీష్ రావు ఆరోపించారు. ఇనుప కంచెలకే పదిహేడు కోట్లు, ఫుట్‌బాల్ ఆడేందుకు పది కోట్లు వెచ్చిస్తున్నారని మండిపడ్డారు. పని చేయని ముఖ్యమంత్రికి ఇన్ని క్యాంపు కార్యాలయాలు ఎందుకని ప్రశ్నించారు. ఏడు కోట్లతో జీవో ఇచ్చి ఇప్పటికే డెబ్బై కోట్ల పైగా ప్రజాధనం వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవంటున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి సోకుల కోసం వందల కోట్లు ఖర్చు చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బదిలీల ప్రక్రియ పూర్తి!

**వైద్య ఆరోగ్యశాఖలో ముగిసిన బదిలీలు**

**157 కేడర్లలో 4,869 మందికి స్థానచలనం**



**హైదరాబాద్:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో బారీ స్థాయిలో చేపట్టిన బదిలీల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఆస్పత్రుల్లో రోగులకు అందే సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వైద్య సంస్థల్లో మానవ వనరుల సమతుల్యత దెబ్బతినకుండా ప్రభుత్వం వంద యాభై ఏడు కేడర్లకు చెందిన నాలుగు వేల ఎనిమిది వందల అరవై తొమ్మిది మందికి స్థానచలనం కల్పించింది. బదిలీ అయినవారిలో పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో అత్యధికంగా 2258మంది ఉన్నారు. త్వరలో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ టీచింగ్ ఆస్పత్రుల్లో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తనిఖీలు ప్రారంభం కానున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ఆస్పత్రుల్లో అవసరమైన మేరకు వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, అధ్యాపకులు అందుబాటులో ఉండేలా బదిలీలు నిర్వహించారు. ఒకే ఆస్పత్రి నుంచి పెద్ద సంఖ్యలో సిబ్బందిని ఒకేసారి మారిస్తే రోగుల సేవలకు ఇబ్బంది కలుగుతుందని భావించి.. ఒకే స్టేషన్‌లో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ ఏళ్లు పనిచేసిన వారికి మాత్రమే బదిలీ అవకాశం కల్పించారు. ప్రజలకు అవసరమైన తొంభై శాతం వైద్య సేవలను జిల్లా స్థాయిలోనే అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను బలోపేతం చేస్తోంది. కొత్తగా నియామకాలు పొందుతున్న వైద్య సిబ్బందికి గ్రామీణ, జిల్లా స్థాయి సంస్థల్లోనే పోస్టింగులు ఇస్తోంది. ఈ తాజా బదిలీలతో ఏళ్ల తరబడి జిల్లాల్లో పనిచేసిన సిబ్బందికి, వైద్యులకు హైదరాబాద్ వచ్చే అవకాశం దక్కింది. దీంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు పారదర్శకంగా జరగడంతో ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# ప్రవేశాలు పెరగాలి!

**డీఈవోలకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు**

**హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు భారీగా పెంచేలా పటిష్ట చర్యలు చేపట్టాలని తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. బడులు పునఃప్రారంభం నాటికి మౌలిక వసతులు సహా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీఈవోలకు కీలక దిశానిర్దేశం చేశారు. విద్యా నాణ్యత మెరుగుదలకు అన్ని పాఠశాలల్లో అకడమిక్ ప్యానెల్ తనిఖీలు నిర్వహించాలని నవీన్ మిట్టల్ సూచించారు. ఉపాధ్యాయుల సర్దుబాటు సమస్యలను వెంటనే పరిష్కరించి ఎక్కడా బోధనా సిబ్బంది కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానంతో పాటు ప్రీ ప్రైమరీ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశించారు. ఏకరీతి దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, తయారీ, వడ్డించే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను డైరెక్టర్ ఆదేశించారు. బడుల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు నిర్వహించే కార్యక్రమాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రెండు వేల ఇరవై ఆరు - ఇరవై ఏడు విద్యా సంవత్సరాన్ని అభ్యాస ఫలితాల మెరుగుదల సంవత్సరంగా మార్చేందుకు అధికారులంతా సమిష్టి కృషితో, అంకితభావంతో పనిచేయాలని నవీన్ మిట్టల్ కోరారు.

# దేశాభివృద్ధికి విద్యే పునాది!

- చదువుతోనే వెనుకబాటుకు చెక్!
- నీతి ఆయోగ్ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్
- ఆరు నగరాల కోసం ఎం-6 టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదన
- ఒక్కో నగరానికి ఆరు లక్షల కోట్లు ఇవ్వాలన్న రేవంత్
- ఐఐఎం మంజూరు చేయాలని వినతి
- మూసీ, ఫ్యూచర్ సిటీలకు సహకరించాలని విజ్ఞప్తి
- యంగ్ ఇండియా బడులను పరిశీలించాలని అధికారులకు ఆహ్వానం
- సమావేశం అనంతరం ప్రధాని మోదీతో ప్రత్యేక భేటీ



**న్యూఢిల్లీ:** దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని ఆకాంక్షించారు. గురువారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన పదకొండో నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ఆయన పాల్గొని తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. డబ్బు, భూమి కంటే విద్య లేకపోవడమే సామాజిక వెనుకబాటుకు ప్రధాన కారణమని కులగణన సర్వేలో తేలిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ వెనుకబాటును నిర్మూలించేందుకే రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా వచ్చి తాము నిర్మిస్తున్న ఈ పాఠశాలలను స్వయంగా పరిశీలించవచ్చని ఆహ్వానించారు. యువతకు ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించేందుకే ఆనంద్ మహీంద్రా, శ్రీనివాసరాజు లాంటి కార్పొరేట్ దిగ్గజాల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వివరించారు. టాటా గ్రూప్ సహకారంతో రెండు వేల వందల కోట్ల రూపాయల పెట్టుబడితో రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. రెండు వేల ముప్పై నాలుగు నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, రెండు వేల నలభై ఏడు నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. హైదరాబాద్‌కు ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణకు అంతర్జాతీయ వర్సిటీలను రప్పించే క్రమంలో హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తమ తొలి విజయమని గుర్తుచేశారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజిన్లుగా ఉన్న న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి ఎం-6 టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ఈ ఆరు నగరాల్లో మౌలిక వసతుల కోసం ఒక్కో నగరానికి ఆరు లక్షల కోట్ల రూపాయల చొప్పున ప్రత్యేక నిధిని కేంద్రం కేటాయించాలని కోరారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ నిర్మాణాలకు కేంద్రం సహకరించాలని సూచించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నీతి ఆయోగ్ సమావేశం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణకు సంబంధించిన పలు కీలక ప్రాజెక్టుల అనుమతులు, నిధుల కేటాయింపులపై చర్చించారు. ప్రధానంగా మూసీ రివర్ ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ, మెట్రో రెండో దశ పనులకు కేంద్రం నుంచి దక్కాల్సిన తోడ్పాటుపై ఆయనతో సుదీర్ఘంగా మాట్లాడారు.

# తోడ్పాటు అందించండి!

- ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ
- మెట్రో రెండో దశ, ట్రిపుల్ ఆర్‌కు ఆమోదం తెలపాలి
- రాష్ట్రానికి ఐఐఎం మంజూరు చేయాలని వినతి

**న్యూఢిల్లీ:** తెలంగాణకు సంబంధించిన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని ప్రధానిని సీఎం కోరారు. 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మేర 38,595 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థగా మంజూరు చేయాలన్నారు. రీజనల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు 626 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు నిర్మించే దక్షిణ భాగం అలైన్‌మెంట్ మ్యాపులను ఇప్పటికే కేంద్ర రహదారుల శాఖకు అందించామని, ఈ రెండు భాగాలను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టును కలిపే 12 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. 120 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదించిన ఈ రహదారి ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఇతర రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ విమానాశ్రయ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసి అథారిటీకి అప్పగించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధానికి వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం లక్ష్యం కూడా నెరవేరుతుందని ఆయన ప్రస్తావించారు.

# దోపిడీ సర్కార్!

**ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన కవిత**



**నల్గొండ:** ధాన్యం కొనుగోళ్లలో తరుగు, రవాణా పేరుతో రైతుల నుంచి ఏకంగా పన్నెండు వందల కోట్లు దోచుకున్న సిగ్గులేని ప్రభుత్వం రాష్ట్రంలో నడుస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకు సర్కారు కుట్ర చేస్తోందని ఆమె ఆరోపించారు. రైతు సమస్యలపై గురువారం నల్గొండలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం ఒక్క సమీక్ష కూడా నిర్వహించకపోవడం రైతుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. మృగశిర కార్తె ప్రారంభమైనా నేటికీ రైతు భరోసా నిధులు విడుదల కాలేదని, రుణమాఫీ అమలు పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. క్వింటాకు ఆరు కిలోల తరుగు పేరిట రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తామన్న హామీ గాలికొదిలేసి కొందరు నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లా ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, పాలమూరు ఎత్తిపోతల ద్వారా నల్గొండకు కూడా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి పారిశ్రామికవేత్తలకు ఇస్తున్న సౌకర్యాలన్నీ రైతులకూ కల్పించాలని కవిత ప్రభుత్వానికి సూచించారు. రైతుల పక్షాన పోరాడేందుకు తెలంగాణ రక్షణ సేనకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ఈ సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. రైతు డిస్కం ఆలోచన విరమించుకోవడం, యూరియా యాప్ రద్దు చేయడం, బకాయి పడిన రైతు భరోసా తక్షణమే అందించడం, కౌలు రైతులను గుర్తించి ఆర్థిక సాయం ఇవ్వడం, వ్యవసాయ కూలీలకు పన్నెండు వేల రూపాయల చెల్లింపు, మూసీ కాలుష్య నివారణ, నిమ్మ, బత్తాయి, పత్తి రైతుల సమస్యల పరిష్కారం లాంటి మొత్తం పది తీర్మానాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. భవిష్యత్తులో ఉమ్మడి కార్యాచరణతో బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని కవిత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం నల్గొండలో పర్యటించి, వివిధ పంటలను పరిశీలించి రైతులసమస్యలను అడిగి తెలుసుకున్నారు.



# దొంగ ఓట్లు తీసేస్తే భయమా?

**విపక్షాల తీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఫైర్**

**ఎస్ఈఆర్ ప్రక్రియపై బురదజల్లడం సరికాదని హితవు**

**సిద్దిపేట:** ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం చేపట్టిన 'ఎస్ఈఆర్' ప్రక్రియపై విపక్షాలు ఉద్దేశపూర్వకంగా బురదజల్లుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. దొంగ ఓట్లను తొలగిస్తుంటే ప్రతిపక్షాలకు ఎందుకంత భయమని ఆయన సూటిగా ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మాతృపల్లిలో నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా స్థాయి శిక్షణా తరగతుల్లో రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగ ఓట్లను ఏరివేయడం ఎన్నికల సంఘం ప్రాథమిక విధి అని స్పష్టం చేశారు. గతంలో ఈ ప్రక్రియ నిర్వహించినప్పుడు తాము సంపూర్ణ మద్దతు ఇచ్చామని, ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు తమపై ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఎస్ఈఆర్ ప్రక్రియ సాఫీగా కొనసాగుతోందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రాంతంలోనే దానిని వినియోగించుకునేలా చేయడమే దీని ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను మోసం చేశాయని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగుతున్న బీజేపీని మాత్రమే ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఎస్ఈఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ఈ ప్రక్రియను కేవలం రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఎస్ఈఆర్ అమలులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గాంధీభవన్ చేరుకున్న కామారెడ్డి పంచాయితీ

**క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన చంద్రశేఖర్**

**హైదరాబాద్, జూన్ 11:** కామారెడ్డి పంచాయితీ మరోసారి గాంధీభవన్‌కు చేరింది. గురువారం పార్టీ నేత చంద్రశేఖర్ రెడ్డి.. క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇచ్చారు. సీనియర్ నేత షబ్బీర్ అలీ వల్లనే కామారెడ్డిలో 20 ఏళ్లుగా పార్టీ గెలవడం లేదని చెప్పారు. గత 20 రోజులుగా కామారెడ్డి పంచాయితీ.. కాంగ్రెస్ పార్టీలో హైటెన్షన్ వాతావరణాన్ని నెలకొల్పింది. సీనియర్ నేత షబ్బీర్ అలీ, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి మధ్య వివాదం చెలరేగింది. వీరిద్దరూ రెండు గ్రూప్‌లుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. పార్టీకి నష్టం చేస్తున్నారంటూ షబ్బీర్ అలీపై చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. అలాగే చంద్రశేఖర్ తనను తిట్టారంటూ షబ్బీర్ అలీ ఆరోపించారు. షబ్బీర్ అలీ ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్ రెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. దీంతో ఈరోజు క్రమశిక్షణ కమిటీ ముందు చంద్రశేఖర్ హాజరయ్యారు. తనపై వచ్చిన ఆరోపణలన్నింటిపైనా లిఖితపూర్వకంగా క్రమశిక్షణ కమిటీకి వివరించారు. షబ్బీర్ ఆలీ తీరుతో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతోందని, ఆయన్ను పార్టీ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించాలని చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. రెండు రోజుల క్రితం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షబ్బీర్ అలీ ఆడియో వైరల్ అవుతోంది. దీనిపై కూడా క్రమశిక్షణ కమిటీకి చంద్రశేఖర్ రెడ్డి వివరణ ఇచ్చినట్లు సమాచారం.

# సీబీఐ విచారణ జరపాలి!

- గోదావరి ఇసుక దందాపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఆదివాసీల రాజ్యాంగ హక్కులను రక్షించాలి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు నేతల వినతిపత్రం



**హైదరాబాద్:** భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల పరిధిలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగ హక్కులు, భూములను కాపాడేందుకు ప్రత్యేకంగా జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరారు. ఆల్ ఇండియా ఆదివాసీ రాజ్యాంగ హక్కులు, సంస్కృతి పరిరక్షణ సమన్వయ సమితి నాయకులు చందా లింగయ్య దొర, పూర్ణచంద్రరావు, రమేష్, రాజారావు తదితరులు గురువారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ మేరకు ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. రెండు వేల పద్నాలుగు నుంచి ఇప్పటివరకు తవ్విన ఇసుక, దాని ద్వారా వచ్చిన ఆదాయం, గిరిజనాభివృద్ధికి వెచ్చించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాల వ్యవహారంపై తక్షణమే ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరారు.

### గిరిజన సెల్ ఏర్పాటు చేయాలి..

పెసా, అటవీ హక్కుల చట్టం, 1/70 భూ బదలాయింపు చట్టాలున్నా ఆదివాసీలు నిరుద్యోగం, నిర్వాసితత్వంతో ఇబ్బందులు పడుతున్నారని గవర్నర్‌కు వివరించారు. జీవో నంబర్ 3 రద్దు నేపథ్యంలో స్థానిక గిరిజన యువత ఉపాధికి ప్రత్యేక రక్షణలు కల్పించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు పూర్తి పునరావాసం, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కోయ భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని, ఆదివాసీలకు ప్రత్యేక మత కోడ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అటవీ సంపద, ఇసుక, నీటి వనరుల ద్వారా వచ్చే ఆదాయంలో ఎక్కువ వాటాను స్థానిక అభివృద్ధికి కేటాయించాలన్నారు. రాజ్ భవన్‌లో ప్రత్యేక గిరిజన సెల్ ఏర్పాటు చేసి పంచమ షెడ్యూల్ అమలును పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరంజ్యోతి, సూర్యారావు, సత్యనారాయణ, నర్సింగరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వంద ప్రాణాలకు పునర్జన్మ!

- నల్లగొండ ఐకాన్ ఆసుపత్రి అరుదైన ఘనత
- వంద బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్లు సక్సెస్
- మహా నగరాలకు వెళ్లే తిప్పలు, తప్పిన ఖర్చు
- పొరుగు జిల్లాల నుంచి పోటెత్తుతున్న రోగులు
- పేదల ప్రాణాలు కాపాడటమే లక్ష్యమన్న డాక్టర్ శశాంక్




**నల్లగొండ:** మెదడులో కణితి (బ్రెయిన్ ట్యూమర్) అనగానే లక్షల ఖర్చు.. మహా నగరాలకు పరుగులు.. ఇవన్నీ గతం. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్న ఐకాన్ ఆసుపత్రి అత్యాధునిక వైద్యంతో ఏకంగా వంద బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి జిల్లా వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఒకప్పుడు మెదడు సంబంధిత వ్యాధులకు చికిత్స పొందాలంటే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. శస్త్రచికిత్స, ఐసీయూ, మందులు ఇతర ఖర్చుల కోసం పది నుంచి ఇరవై లక్షల రూపాయల వరకు వ్యయం అయ్యేది. దీంతో ఎందరో అప్పులపాలై ఆర్థికంగా కుదేలయ్యేవారు. సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయేవారు. ఇలాంటి పరిస్థితులను మారుస్తూ నల్లగొండలోని ఐకాన్ ఆసుపత్రి అత్యుత్తమ న్యూరో సర్జరీ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అత్యంత క్లిష్టమైన వంద కేసుల్లో మెదడులోని కణితులను అత్యంత జాగ్రత్తగా తొలగించి రోగులకు పునర్జన్మ ప్రసాదించింది. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, హైటెక్ పరికరాలతో పాటు ప్రముఖ న్యూరో సర్జన్ ప్రొఫెసర్ రాజేష్, డాక్టర్ కోడె శశాంక్, డాక్టర్ సాయి మౌనిక చెరుకూరి, డాక్టర్ సాయి లావణ్య కడిమి నేతృత్వంలోని వైద్య బృందం, సిబ్బంది కృషితోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. ఇక్కడి నాణ్యమైన వైద్య సేవలతో యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి కూడా రోగులు ఐకాన్ ఆసుపత్రికి వస్తున్నారు. ఆర్థిక స్థోమత లేని కారణంగా ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదన్నదే తమ ప్రధాన లక్ష్యమని న్యూరో సర్జన్ డాక్టర్ కోడె శశాంక్ స్పష్టం చేశారు. పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా ప్రజలకు ఇక్కడే అత్యుత్తమ వైద్యం అందించడమే తమ సంకల్పం అని తెలిపారు. భవిష్యత్తులో మరింత అధునాతన న్యూరో సర్జరీలు, అత్యవసర మెదడు, వెన్నుపూస చికిత్సలతో పాటు సూపర్ స్పెషాలిటీ సేవలను అందరికీ అందుబాటులోకి తెస్తామని ఆయన వెల్లడించారు. వంద శస్త్రచికిత్సలు విజయవంతం కావడం తమ బాధ్యతను మరింత పెంచిందని వైద్య బృందం ఆనందం వ్యక్తం చేసింది.

# వినాశకర రాజకీయం!

- మోదీ పాలనలో సామాన్యుల బతుకు దుర్భరం
- మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో కేసులు లేవు
- కేంద్రం తీరుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ ఫైర్



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో సామాన్యుల బతుకు దుర్భరంగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక బీజేపీ కక్షపూరిత రాజకీయ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. దేశంలో పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. గృహిణులను ఇబ్బంది పెడుతూ వంట గ్యాస్ ధరలను పెంచుతున్నారని విమర్శించారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఏఐసీసీ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించామని ఆయన వెల్లడించారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్‌పై ఎక్కడా ఎలాంటి కేసు నమోదు కాలేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టంచేశారు. ఆమె మహిళ అని కూడా చూడకుండా రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగానే నామినేషన్ తిరస్కరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో ఇలా ఎప్పుడూ జరగలేదని, ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు లాంటిదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పూర్తిగా వినాశకర రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# అద్దె భవనాలకు స్వస్తి!

- ప్రభుత్వ ఆఫీసులకు సొంత భవనాలు.. గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణాలు
- మెరుగైన పాలన అందించడమే లక్ష్యమన్న మంత్రి పొంగులేటి



**హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రజలకు మరింత పారదర్శకమైన, సౌకర్యవంతమైన పాలన అందించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అద్దె, శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్వస్తి పలికి.. అన్ని హంగులతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సచివాలయంలో గురువారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, శిథిలావస్థలో ఉన్నాయో అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సేవలు అందించే కేంద్రాలు హుందాగా ఉండాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. తొలి దశలో నూట ఇరవై ఐదు తహసీల్దార్, పదకొండు ఆర్డీవో కార్యాలయాలకు అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. ఇందుకోసం వెంటనే స్థలాలు గుర్తించి పనులు ప్రారంభించేలా తక్షణ కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దనున్నారు. గత ప్రభుత్వం ఎటువంటి ముందుచూపు, ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని, కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేసిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ల శాఖలో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ముప్పై తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పన్నెండు క్లస్టర్లుగా విభజించి నిర్మిస్తున్నట్లు చెప్పారు. గచ్చిబౌలి, మేడ్చల్, పీర్జాదిగూడ, కోహెడ ప్రాంతాల్లో ఇప్పటికే శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించామన్నారు. జిల్లాల్లో పత్రాల రిజిస్ట్రేషన్ల సంఖ్యకు అనుగుణంగా నాలుగు వేల నుంచి పది వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే నమూనాలో ఆఫీసులు నిర్మిస్తామని మంత్రి పొంగులేటి వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల స్థలాల గుర్తింపు ప్రక్రియ వేగంగా సాగుతోందని, త్వరలోనే కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.



# ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- జనరల్, వృత్తివిద్యా కోర్సుల మార్కుల మెమోలు అందుబాటులో..
- మే పదిమూడు నుంచి ఇరవై ఒకటి వరకు జరిగిన పరీక్షలు
- రాష్ట్రవ్యాప్తంగా హాజరైన సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులు
- పదిహేడు కేంద్రాల్లో వేగంగా ముగిసిన జవాబు పత్రాల మూల్యాంకనం
- అధికారిక వెబ్‌సైట్ల ద్వారా స్కోర్ కార్డుల డౌన్‌లోడ్

**హైదరాబాద్:** తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన జనరల్, వృత్తి విద్యా (ఒకేషనల్) కోర్సుల విద్యార్థుల మార్కుల మెమోలను విద్యామండలి అందుబాటులోకి తెచ్చింది. హాల్ టికెట్ నంబర్ ద్వారా విద్యార్థులు తమ ఫలితాలను చూసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా మే పదిమూడో తేదీ నుంచి ఇరవై ఒకటో తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు ఎనిమిది వందల ఎనభై తొమ్మిది కేంద్రాల్లో మూడు లక్షల తొంభై ఎనిమిది వేల నాలుగు వందల యాభై తొమ్మిది మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన వెంటనే పదిహేడు ప్రత్యేక కేంద్రాల్లో జవాబు పత్రాల మూల్యాంకనాన్ని విద్యామండలి వేగంగా పూర్తి చేసింది. ఏమాత్రం జాప్యం లేకుండా గురువారం సకాలంలో ఫలితాలను ప్రకటించింది. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్‌ను ఉపయోగించి బోర్డు అధికారిక వెబ్‌సైట్ల నుంచి తమ స్కోర్ కార్డు (మార్కుల మెమో)ను సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

# బిడ్డలతో తల్లి అదృశ్యం!

- కామారెడ్డిలో మిస్సింగ్ కలకలం..రెండు రోజుల క్రితం ఘటన
- దారితీసిన కుటుంబ కలహాలు.. సీసీ కెమెరాల ఆధారంగా గాలింపు



**కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా కేంద్రంలో మిస్సింగ్ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ తల్లి తన ముగ్గురు పిల్లలతో సహా అదృశ్యమైంది. బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన లయ (31) అనే మహిళకు ఇద్దరు కుమార్తెలు బిందు (16), దివిజ (8), కుమారుడు శివ (13) ఉన్నారు. భార్యాభర్తల మధ్య చాలా కాలంగా వివాదాలు నడుస్తున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్దిచెప్పడంతో కొంతకాలంగా వీరంతా గాంధీనగర్‌లోనే కలిసుంటున్నారు. ఇటీవల మళ్లీ గొడవలు మొదలుకావడంతో లయ తీవ్ర మనస్తాపం చెందింది. రెండు రోజుల క్రితం తన ముగ్గురు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ కెమెరాల దృశ్యాలు, ఫోన్ కాల్స్ ఆధారంగా వారి ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

# ఖమ్మం రైతులకు భరోసా!

- ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ



**హైదరాబాద్:** ఖమ్మం జిల్లా రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని జలసౌధలో గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతమ్మసాగర్ సహా జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరానికీ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల కొరత లాంటి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ఖమ్మం జిల్లా భవిష్యత్తును మార్చే అత్యంత కీలక ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు నీరు అందిస్తూనే.. పాత ఆయకట్టు స్థిరీకరణ చేపడతామన్నారు. మున్నేరు–పాలేరు అనుసంధానం ద్వారా ఖమ్మం, సూర్యాపేట జిల్లాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. విద్యుత్ ఖర్చు లేకుండా కేవలం గ్రావిటీ (గురుత్వాకర్షణ) ద్వారానే నీటిని మళ్లించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భద్రాచలం, ఖమ్మం వరద రక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. రైతు సంక్షేమమే తమ ధ్యేయమని, ప్రతి ప్రాజెక్టుకూ గడువు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం





# ప్రజాస్వామ్య రక్షణకు 'మహా విలీనం' బ్రహ్మాస్త్రం!

దేశంలో ప్రాంతీయ పార్టీల మనుగడ రోజురోజుకూ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణమిది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తన దర్యాప్తు సంస్థలను ప్రయోగించి ప్రత్యర్థి పార్టీలను కబళిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదంగా పరిణమించింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీలను నిలువునా చీల్చి తన ఖాతాలో వేసుకున్న కమలనాథులు.. ఇప్పుడు అదే వ్యూహాన్ని పశ్చిమ బెంగాల్‌లో అమలు చేస్తున్నారు. పదిహేనేళ్లుగా బెంగాల్ ప్రజల మద్దతుతో అజేయ శక్తిగా నిలిచిన మమతా బెనర్జీని నేరుగా రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం అనైతిక చర్యలకు పాల్పడుతోంది. ఈడీ, సీబీఐ దాడుల భయంతో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతలు బీజేపీ వైపు చూసేలా తీవ్ర స్థాయి ఒత్తిడి తెస్తోంది. ఆపరేషన్ లోటస్ పేరుతో ఇతర పార్టీల నేతలను బెదిరించి, ప్రలోభపెట్టి లాక్కోవడం బీజేపీకి ఒక దినచర్యగా మారిపోయింది.

ప్రజానాయకురాలిగా సామాన్యుల పక్షాన నిలబడి ఏళ్ల తరబడి పోరాటాలు చేసిన మమతా బెనర్జీ అప్రతిహత విజయాలను చూసి ఓర్వలేకనే కమలం పార్టీ ఈ కుట్రలకు తెరతీసింది. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ఆమెపై అసత్య ఆరోపణలు చేస్తూ, చొరబాటుదారులంటూ తప్పుడు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోంది. అయితే విపక్ష నేతలపై కేంద్ర సంస్థలు సాగిస్తున్న ఉక్కుపాదం వల్లే నేడు బెంగాల్ లో అసమ్మతి సెగలు రగులుతున్నాయి. సువేందు అధికారి, కకోలి ఘోష్ దస్తిదార్ లాంటి సీనియర్లతో పాటు శతృఘ్న సిన్హా, యూసుఫ్ పఠాన్ లాంటి వారు పార్టీకి వ్యతిరేకంగా గళం విప్పారంటే.. వారి వెనుక కేంద్ర సంస్థల భయం, అధికార పార్టీ ప్రలోభాలు ఏ స్థాయిలో ఉన్నాయో సులభంగా అర్థం చేసుకోవచ్చు. జగదీష్ చంద్ర మసునియా, ఖలీలుర్ రెహమాన్, అబూ తాహెర్ ఖాన్, పార్థ భౌమిక్, బాపి హల్దార్, మాలా రాయ్, మితాలీ బాగ్, దీపక్ అధికారి, కాళీపాద సొరేన్, జూన్ మాలియా, అరూప్ చక్రబర్తి, షర్మిలా సర్కార్, అసిత్ కుమార్, శతాబ్ది రాయ్, రచనా బెనర్జీ తదితరులతో ఒక అసమ్మతి వర్గాన్ని బీజేపీ తెరవెనుక ఉండి నడిపిస్తోంది. ఏకంగా 64 మంది ఎమ్మెల్యేలు, 19 మంది ఎంపీలను చీల్చడం ద్వారా ఒక బలమైన ప్రాంతీయ పార్టీని దెబ్బతీయాలన్నది బీజేపీ కుటిల వ్యూహం.

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఒంటరి పోరాటం కన్నా.. జాతీయ స్థాయిలో బలమైన వేదిక ఏర్పాటు చేసుకోవడమే ప్రస్తుత రాజకీయ సంక్షోభానికి ఏకైక పరిష్కారం. అందుకే టీఎంసీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలన్న సోనియా గాంధీ ప్రతిపాదన అత్యంత చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది మమతా బెనర్జీ బలహీనతకు నిదర్శనం ఏమాత్రం కాదు.. ఇది ఒక ఫాసిస్టు వ్యవస్థను ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న వ్యూహాత్మక అడుగు. 1998లో కాంగ్రెస్ నుంచి విడిపోయి టీఎంసీని స్థాపించిన మమత.. ఇప్పుడు దేశ ప్రయోజనాల కోసం తిరిగి సొంత గూటికి చేరితే అది భారతీయ రాజకీయాల్లోనే పెను సంచలనం అవుతుంది. దీనివల్ల కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా మరింత బలోపేతం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేసి వాళ్ల ఆస్తులను, పార్టీ గుర్తులను లాక్కోవాలని చూస్తున్న బీజేపీ వ్యూహాలకు ఈ విలీనం ద్వారా గట్టి చెక్ పెట్టవచ్చు. చీలిక వర్గాలకు ఎన్నికల సంఘం గుర్తింపు రాకుండా చేయాలంటే, పార్టీ ఉనికిని కాపాడుకోవాలంటే జాతీయ పార్టీ గొడుగు కిందకు రావడం అత్యంత ఆవశ్యకం. టీఎంసీ విలీనంతో కాంగ్రెస్ పార్టీకి బెంగాల్ లో తిరుగులేని బలం వస్తుంది. అలాగే జాతీయ స్థాయిలో బీజేపీకి ఎదురునిలబడే శక్తి రెట్టింపు అవుతుంది. మమత లాంటి పోరాటయోధురాలు కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షురాలిగా, యువ నేత అభిషేక్ బెనర్జీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపడితే ప్రతిపక్ష కూటమికి కొత్త రక్తం వచ్చినట్లవుతుంది. ఇప్పటికే రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా సాగిస్తున్న సిద్ధాంతపరమైన పోరాటానికి.. మమతా బెనర్జీ మాస్ ఇమేజ్ తోడైతే బీజేపీని జాతీయ స్థాయిలో సమర్థవంతంగా ఢీకొట్టవచ్చు.



బెంగాల్‌లో సీనియర్ కాంగ్రెస్ నేతలు ఈ విలీనంపై తొలుత అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ.. జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే ఈ కలయిక అనివార్యం అని త్వరలోనే వారు గ్రహిస్తారు. అధికార మదంతో ప్రాంతీయ పార్టీల మనుగడ లేకుండా చేయాలని చూస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలంటే విడివిడిగా కన్నా.. ఉమ్మడిగా పోరాడటమే శ్రేయస్కరం. ఢిల్లీలో సోనియా గాంధీతో మమత జరుపుతున్న చర్చలు ఫలిస్తే.. అది కేవలం ఒక పార్టీ భవితవ్యాన్ని మాత్రమే కాదు, మొత్తం దేశ రాజకీయ ముఖచిత్రాన్నే మారుస్తుంది. రాజ్యాంగ విలువల రక్షణ కోసం ఇరు పార్టీల అధినాయకత్వాలు పాత పగలు, విభేదాలు పక్కనపెట్టి ఒక్కటవ్వడం దేశ రాజకీయాలకు అత్యంత శుభపరిణామం. బీజేపీ కబళింపు రాజకీయాలకు, కేంద్ర సంస్థల దుర్వినియోగానికి కాలం చెల్లే రోజులు ఈ మహా విలీనంతోనే మొదలవుతాయి

# 2047 నాటికి నవభారత నిర్మాణం



- 'వికసిత్ భారత్'పై నీతి ఆయోగ్ చారిత్రాత్మక మంథనం!
- ప్రతి పౌరుడి జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
- ప్రధాని అధ్యక్షతన గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం
- సమగ్ర మానవాభివృద్ధి, నైపుణ్యాలు, ఉపాధి, ఆరోగ్య రంగాలపై చర్చ

**న్యూఢిల్లీ, జూన్ 11:** దేశాన్ని 2047 నాటికి సంపూర్ణ అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే చారిత్రాత్మక లక్ష్యంతో 'నీతి ఆయోగ్' గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ ఉన్నత స్థాయి భేటీలో సమగ్ర మానవాభివృద్ధి, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ప్రజల సంక్షేమ కార్యక్రమాలే అజెండాగా విస్తృతంగా మంథనం చేశారు. ఈ ఏడాది సదస్సుకు "వికసిత్ భారత్-2047 కోసం సమగ్ర మానవాభివృద్ధి" అనే ప్రధానాంశాన్ని ఎంచుకున్నారు. వయస్సు, ప్రాంతం, లింగం, సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా దేశంలోని ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే విప్లవాత్మక విధానాలపై ఈ సందర్భంగా ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలో యువతను ఉద్యోగాలు అడిగే వారిగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేర్చేలా వ్యవస్థాపకతను (ఆంట్రప్రెన్యూర్‌షిప్) ప్రోత్సహించడం, నైపుణ్యాలను పెంపొందించడం, స్థిరమైన ఉపాధి అవకాశాలను విస్తరించడం వంటి అంశాలను ప్రధాని మోదీ ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు నీతి ఆయోగ్ వెల్లడించింది.

### నాలుగు ప్రధాన రంగాలకు అగ్రతాంబూలం

సమగ్ర మానవాభివృద్ధి కోసం రూపొందించిన భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా నాలుగు కీలక రంగాలపై ప్రధానంగా చర్చ సాగింది. భవిష్యత్ గ్లోబల్ అవసరాలకు అనుగుణంగా మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల పెంపు, ఉత్పాదక ఉపాధి అవకాశాల సృష్టి, వికేంద్రీకృత అభివృద్ధి, ఆరోగ్యం, పోషకాహారం, సంక్షేమం, ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారు. దేశవ్యాప్తంగా సాగుతున్న అభివృద్ధి ఫలాలు సమాజంలో చివరి వరుసలో ఉన్న వ్యక్తికి కూడా అందేలా పటిష్టమైన విధానాలను రూపొందించాల్సిన అవసరాన్ని సమావేశంలో నొక్కిచెప్పారు. వీటితో పాటు డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ, డేటా ఆధారిత విధానాల అమలు, పాలనలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై కూడా లోతుగా చర్చించారు. డిజిటల్ పబ్లిక్ మౌలిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు కార్యాచరణ రూపొందించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాల అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థ అవసరమనే అభిప్రాయం వ్యక్తమైంది.

### రాష్ట్రాల ప్రణాళికల అనుసంధానం

రాష్ట్ర ప్రభుత్వాల స్వల్పకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలను జాతీయ లక్ష్యాలతో పక్కాగా అనుసంధానం చేయడం, టీమ్ ఇండియా స్ఫూర్తితో కేంద్ర-రాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగడమే ఈ సమావేశం ప్రధాన లక్ష్యంగా నిలిచింది. గతంలో నిర్వహించిన జాతీయ ప్రధాన కార్యదర్శుల సదస్సులో వచ్చిన అమూల్యమైన సూచనల అమలు తీరుపై కూడా ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యా ప్రమాణాలు పెంచడం, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, పాఠ్యేతర కార్యక్రమాల విస్తరణ వంటి అంశాలపై రాష్ట్రాలతో కలిసి పనిచేసే మార్గాలపై చర్చించారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో పాటు పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. అలాగే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు, సభ్యులు, ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) హాజరై దేశాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై తమ అద్భుతమైన అభిప్రాయాలను వెల్లడించారు.

# ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి

### కాల్పుల్లో ముగ్గురు నావికుల మృతి: ధ్రువీకరించిన మంత్రి



**న్యూఢిల్లీ, జూన్ 11:** ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన దాడి కలకలం సృష్టించింది. దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని, ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించారు. సురేశ్ తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని... అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతేగాకుండా దిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మిక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. 24 మంది భారతీయులున్న మరో నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారంరోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. ఈ రోజు ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవిహార్‌గా తెలుస్తోంది.

# స్వదేశీ రక్షణ రంగానికి చారిత్రాత్మక మైలురాయి



- భారత్‌లో తయారైన తొలి సీ295 విమానం విజయవంతం
- వడోదర నుంచి గాల్లోకి ఎగిరిన 'మేడ్ ఇన్ ఇండియా' సైనిక విమానం
- టాటా-ఎయిర్‌బస్ భాగస్వామ్యంతో కొత్త చరిత్ర

**న్యూఢిల్లీ, జూన్ 11:** భారత రక్షణ, విమానయాన రంగాల్లో గురువారం చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. దేశంలోనే తయారైన తొలి 'మేడ్ ఇన్ ఇండియా' సీ295 సైనిక రవాణా విమానం విజయవంతంగా తొలి పరీక్షా ప్రయాణాన్ని పూర్తి చేసింది. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన తుది అసెంబ్లీ కేంద్రం నుంచి ఈ విమానం గాల్లోకి ఎగరడంతో స్వదేశీ రక్షణ తయారీ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. విమానం తయారీ పూర్తయిన అనంతరం నిర్వహించే పరీక్షల్లో తొలి ప్రయాణం అత్యంత కీలక దశగా భావిస్తారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో విమానం పనితీరు, భద్రతా ప్రమాణాలపై కీలక సమాచారం లభించనుంది. ఈ విజయాన్ని ఎయిర్‌బస్ సంస్థ అధికారికంగా ప్రకటిస్తూ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణించింది.

### భారత్‌లోనే 40 విమానాల తయారీ

భారత వైమానిక దళం కోసం మొత్తం 40 సీ295 విమానాలను దేశంలోనే తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో తొలి విమానం ఇప్పుడు పరీక్షా దశను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ఏడాది చివరి నాటికి మొదటి స్వదేశీ సీ295 విమానాన్ని భారత వైమానిక దళానికి అప్పగించే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా దేశంలో విమాన తయారీ సామర్థ్యాలు మరింత బలోపేతం కావడంతో పాటు రక్షణ రంగంలో స్వావలంబనకు ఊతమిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత రక్షణ తయారీ చరిత్రలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో సైనిక విమానం తయారు కావడం ఇదే తొలిసారి. ఎయిర్‌బస్ సంస్థతో కలిసి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోంది. దేశవ్యాప్తంగా అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూడా విమాన విడిభాగాల తయారీలో భాగస్వాములయ్యాయి. ఈ భాగస్వామ్యం ద్వారా దేశీయ పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభించడంతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం భారత్‌కు చేరువవుతోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

### ఆత్మనిర్భర్ భారత్‌కు బలమైన ఊతం

ఈ విజయంపై భారత వైమానిక దళం హర్షం వ్యక్తం చేసింది. విమానం తొలి ప్రయాణాన్ని విజయవంతం చేసిన మొత్తం బృందాన్ని అభినందించింది. స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ సాధిస్తున్న పురోగతికి ఇది నిదర్శనమని పేర్కొంది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రక్షణ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. సీ295 విమానం విజయవంతమైన తొలి ప్రయాణం ప్రపంచ రక్షణ రంగంలో భారత్ సామర్థ్యాన్ని మరోసారి చాటిచెప్పిన ఘట్టంగా నిలిచింది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా బి.రవీందర్ సింగ్ బాధ్యతల స్వీకరణ



జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు పూలమొక్క అందజేస్తున్న రవీందర్ సింగ్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా నూతన వ్యవసాయ శాఖ అధికారిగా బి.రవీందర్ సింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ నూతన అధికారికి శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయ శాఖ కార్యకలాపాలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న వ్యవసాయ పథకాలు రైతులకు చేరేలా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ స్వామి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీస్ కానిస్టేబుల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల నియామక పరీక్షలకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, కెరీర్ గైడెన్స్ సెల్ ఇంచార్జి డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. ఈ శిక్షణలో చేరేవారు ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమం ఈనెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణ నిర్వహించడం జరుగుతుందని వివరించారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు ఇంటర్, 10వ తరగతి మెమో, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. ఉద్యోగ అవకాశాలను లక్ష్యంగా పెట్టుకున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని శిక్షణలో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాల కోసం సెల్: 97011 97764,70136 07011 నంబర్లపై సంప్రదించాలని పేర్కొన్నారు.

# ఎంపీపీ ఎస్ పాఠశాలలో టాయిలెట్స్ కు భూమి పూజ

- టాయిలెట్స్ కు భూమి పూజ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గురువారం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి మంజూరైన టాయిలెట్ కు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ఎంపీడీఓ పి.శ్రీనివాస్, ఎంపీఓ జి.అనిల్ కుమార్, తాండూర్ మండల విద్యాధికారి దుర్గం శ్రీనివాస్, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి దొండ దివాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డు సభ్యులు, ఉపాధిహామీ ఈసీ, టీఏ, ఎఫ్ఏ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# లింగగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు యువకుల మృతి
ఒకరికి స్వల్ప గాయలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండల పరిధిలోని లింగగూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా, మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ముగ్గురు యువకులు ఒకే బైక్పై పెనుబల్లి నుంచి లింగగూడెం వైపు వెళ్తుండగా మార్గమధ్యలో అకస్మాత్తుగా ఎదురుగా వచ్చిన గేదెను ఢీకొట్టారు. ఈ ఘటనలో లింగగూడెం గ్రామానికి చెందిన పద్దెం విష్ణు, ములకలపల్లి మండలం కమలాపురం గ్రామానికి చెందిన మీడెం శివ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు ఇనుప గోపాలరావు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ విషాద ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోధనలు హృదయ విదారకంగా మారాయి.

# తుఫాను బీభత్సం

- రోడ్డున పడ్డ అడ్డేసార కుటుంబాలు

**ఉద్యమ కెరటం, జైనూర్ (సబిర్ పాషా) :** మండల పరిధిలోని అడ్డేసార గ్రామపంచాయతీలో బుధవారం వీచిన తీవ్ర గాలి దుమారం, తుఫాను బీభత్సం సృష్టించాయి. ఈ ప్రకృతి వైపరీత్యానికి పలు ఇండ్ల పైకప్పులు గాల్లోకి ఎగిరిపడి, ఇళ్లు పూర్తిగా ధ్వంసమవడంతో బాధితులు తీవ్ర ఆస్తి నష్టాన్ని చవిచూశారు. ఉన్నపళంగా నిలువ నీడ కోల్పోయిన పలు కుటుంబాలు రోడ్డున పడి, కన్నీరుమున్నీరవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి తక్షణమే నష్టపరిహారం లేదా ఆర్థిక సహాయం అందించి తమను ఆదుకోవాలని బాధితులు



దీనంగా వేడుకుంటున్నారు.

**ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటాం**

**ఎఎంసి చైర్మన్ భరోసా**

విషయం తెలుసుకున్న ఎఎంసి చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావ్ గురువారం అడ్డేసార గ్రామంలో పర్యటించి, బాధితులను పరామర్శించారు. అక్కడ తుఫాను సృష్టించిన విధ్వంసాన్ని, కూలిపోయిన ఇళ్లను చూసి ఆయన తీవ్రంగా చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు ప్రభుత్వం తరపున సత్వరమే సహాయం అందేలా తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధైర్యపడొద్దని, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో పాటు, తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పంద్రా కౌస్యల షేకు, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, వార్డ్ మెంబర్లు , స్థానిక నాయకులు రషీద్, హైదర్, గ్రామ పంచాయతీ ప్రజలు, బాధితులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

- మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్మన్ ఎండి అహ్మద్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని ఏడవ వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ లు అన్నారు. గురువారం ఏడవ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కాలనీలో ఉన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి ఇలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిలువేరు వెంకన్న, మున్సిపల్ డి ఈ రమాదేవి, ఏ ఈ నవీన్, బీ ఆర్ ఎస్ నాయకులు సాయి శ్రావణ్, అరవింద్ తదితరులు ఉన్నారు.



# దస్నాపూర్ అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** అఖిల గాండ్ల తెలికుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బిక్కుమల్ల రాంచందర్ రావు పిలుపు మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూతురు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అమనగంటి శ్రీనివాస్, వర్కింగ్ సెక్రటరీ కోసరి సురేశ్ కుమార్, సమన్వయ కమిటీ చైర్మన్ సంగెం రవికుమార్ తదితరులు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్లో పర్యటించారు. ముందుగా వారు సంత్ శ్రీ సంతాజి జగన్నాడే మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివా



ళులర్పించారు. అనంతరం వారం క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన రెండు కుటుంబాలను వారు పరామర్శించారు. ఈ ప్రమాద తీవ్రతతో ధైర్యం కోల్పోయి గుండెపోటుతో మరణించిన ఒక కుటుంబ మహిళా సభ్యురాలి మృతి పట్ల సంతాపం తెలిపి, ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. అనంతరం రాష్ట్ర సంఘం తరపున దాతల నుండి సేకరించిన రూ. 67,000/- ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రె ఆకాష్, ఏఎంసీ డైరెక్టర్ మారుతి , స్థానిక కుల పెద్దలు పాల్గొన్నారు.

# కార్యాలయానికి దిక్కులేని బోర్డు..

- గందరగోళంలో రైతులు..!
- బోర్డులేని వ్యవసాయ శాఖ కార్యాలయం

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి గుర్తింపు బోర్డు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పథకాలు, విత్తనాలు, ఎరువులు తదితర వివరాల కోసం కార్యాలయానికి వచ్చే రైతులు భవనాన్ని గుర్తించలేక అష్టకష్టాలు పడుతున్నారు. సాధారణంగా మండల వ్యవసాయ శాఖ కార్యాలయం రైతులకు కీలక సమాచార కేంద్రంగా ఉంటుంది. అయితే నేరడిగొండ మండల వ్యవసాయ కార్యాలయ భవనంపై కనీస గుర్తింపు బోర్డు కూడా లేకపోవడంతో, ముఖ్యంగా ఇతర గ్రామాల నుంచి వచ్చే రైతులు కార్యాలయం కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వారి సమయం, శ్రమ వృథా అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధ రైతులు, నిరక్షరాస్యులు కార్యాలయం ఎక్కడుందో తెలియక స్థానికులను అడుగుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బోర్డు లేకపోవడంతో అది ప్రభుత్వ కార్యాలయమో, అద్దె భవనమో కూడా గుర్తించడం కష్టంగా మారిందని రైతులు పేర్కొన్నారు. "వ్యవసాయ కార్యాలయానికి గుర్తింపు బోర్డు లేకపోవడంతో అధికారులను కలవడానికి వచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, కార్యాలయం బయట స్పష్టంగా



కనిపించేలా పెద్ద బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# దళిత రత్న అవార్డుకు గొర్లపల్లి వెంకటేష్ ఎంపిక

- మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం కాసిపేట గ్రామానికి చెందిన దళిత ఆదివాసీ బహుజన చైతన్య వేదిక రాష్ట్ర కార్యదర్శి గొర్లపల్లి వెంకటేష్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే "దళిత రత్న" అవార్డుకు ఎంపికయ్యారు. దళిత, గిరిజన, బహుజన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ గౌరవాన్ని ప్రదానం చేసింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా గురువారం చెన్నూర్ క్యాంపు



కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా గొర్లపల్లి వెంకటేష్ దళిత రత్న అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ గుర్తింపు తనకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. కాగా మంత్రి వివేక్ వెంకటస్వామి వెంకటేష్ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో దళిత ఆదివాసీ బహుజన చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి పర్స శ్రీనివాస్, గోమాస రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలు మంజూరు చేయాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలానికి పూర్వ ప్రాథమిక కేంద్రాలు మంజూరు చేయాలని తాండూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. గురువారం తాండూర్ పర్యటనకు వచ్చిన జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 72 పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలు మంజూరయ్యాయని, తాండూర్ మండలానికి ఒక్క కేంద్రం కూడా కేటాయించలేదన్నారు. తాండూర్ మండలంలో ఆర్థికంగా వెనుకబడిన వారు చాలా మంది ఉన్నారన్నారు. పూర్వ ప్రాథమిక విద్య కేంద్రాలు మంజూరు చేస్తే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసాడి శ్రీదేవి శ్రీరాములు, తాండూర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎలుక రామచందర్, టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు బోడ సతీష్, మాజీ సింగల్ విండో చైర్మన్ బి.చంద్రశేఖర్ తదితరులు పాలొన్నారు.



# గుడిసెలు ఉన్న ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధి దారులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

## జిల్లా కలెక్టర్ కే.హరిత

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ళ కొరకు ఎంపిక చేసిన ఎల్–1 జాబితాలో గుడిసెలు కలిగిన లబ్ధిదారుల ఇళ్ళను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కే.హరిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తో కలిసి ఆమె మండల అభివృద్ధి అధికారులు, ఎం పీ ఓ లు, సెర్ప్ ఏ పీ ఎం లు, ఈ జీ ఎస్ ఏ పి ఓ లు ,పంచాయతీ కార్యదర్శులతో సుదీర్ఘ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా 2వ విడత ఇందిరమ్మ ఇళ్ళు, ఇంకుడు గుంతల నిర్మాణం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే గ్రామ సచివాలయ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణ ప్రగతిపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎల్–1 జాబితాలోని గుడిసెలు ఉన్న వారి ఇళ్ళ వద్దకే స్వయంగా వెళ్ళి, వారి సామాజిక–ఆర్థిక స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారుల వివరాలను నమోదు చేసి, తుది జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో క్షేత్రస్థాయి ఇందిరమ్మ కమిటీలు, మహిళా సంఘాల సభ్యుల సహకారాన్ని కూడా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ప్రాథమిక సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూడటంతో పాటు, ప్రతీ ఇంటికీ నీటి కనెక్షన్లు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అలాగే గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు దోహదపడే ఇంకుడు గుంతల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పాఠశాలల ప్రహరీ గోడలు, గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. అధికారులు అందరూ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత కాలవ్యవధిలోగా పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తరావు, పీ డీ ప్రకాష్ రావు, హౌసింగ్ ఈ ఈ, డీఈఈలు, ఏఈఈలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.




# పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మావల మండల కేంద్రంలోని కేఆర్కే కాలనీలో లబ్ధిదారుల కేటాయింపుకు సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ను గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్లకు సంబంధించిన విద్యుత్, తాగునీరు, శానిటేషన్ తదితర మౌలిక సదుపాయాలతో పాటు మిగిలిన అన్ని పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్థానిక గాంధీ పార్కు్ను సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. పార్కులో నిర్మిస్తున్న ఏడు ఫామ్ పాండ్స్, ఐదు బోర్వెల్ రీచార్జ్ స్ట్రక్చర్స్ నిర్మాణ పనులను పరిశీలించి వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే పిల్లలను ఆకట్టుకునే చిల్డ్రన్ ట్రైన్తో పాటు పార్కులో చేపడుతున్న ఇతర మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఓ రవీందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ రాజు, హౌసింగ్ పీడీ శంకర్, తహశీల్దార్ శ్రీనివాస్, ఇంజనీరింగ్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.





# అపన్నహస్తంగా కాంగ్రెస్ నాయకులు

- **బాధితుడికి చికిత్స కోసం రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేత**

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** కిడ్నీ సమస్యతో బాధపడుతున్న శ్రీగాథ గ్రామానికి చెందిన బందెల శంకరయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.2.50లక్షల ఎల్ఓసీని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శంకరయ్య పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే. మహేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వారి చొరవతో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రూ.2.50 లక్షల ఎల్ఓసీని మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సహాయం అందించడంలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు కేకే. మహేందర్ రెడ్డిలకు శంకరయ్య కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆర్థిక సాయం చికిత్సకు ఎంతో ఉపయోగపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బందెల రాజు, నాయకులు బందెల ప్రదీప్, గౌరినేని శ్రవణ్ రావు, పర్శ శ్రీనివాస్, వేముల వెంకట్ గౌడ్, బందెల ప్రకాష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఘాతంతో ఇల్లు దగ్ధం

- **బాధితులను పరామర్శించిన మున్సిపల్ చైర్పర్సన్ అనూష**


**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీలో గురువారం విద్యుత్ ఘాతంతో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమై కుటుంబం సర్వస్వం కోల్పోయిన ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఇంట్లోని సామాగ్రి పూర్తిగా కాలిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు బాధితులను పరామర్శించారు. స్థానిక కౌన్సిలర్ నాగ్సేన్, కాలనీవాసులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించి నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వస్వం కోల్పోయిన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నష్ట పరిహారం మంజూరు కోసం తక్షణమే పంచనామా నిర్వహించాలని తహశీల్దార్ను ఆదేశించినట్లు తెలిపారు. ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన రెండు కుటుంబాలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల మంజూరు అంశాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా బట్టలు, దుస్తులు, వంట సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవాలి

- **భావితరాల కోసం పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి**
- **రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద**

ఉద్యమ కెరటం, మంచిర్యాల: అటవీ ప్రాంతాల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం చెన్నూర్ అటవీ రేంజ్ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి, అటవీ శాఖ అధికారులు, సర్పంచ్లు తదితరులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించాలంటే అటవీ అభివృద్ధి, మొక్కల సంరక్షణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా మొసళ్ల పార్కుతో పాటు ఇతర ప్రకృతి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరతో నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మేలు చేసినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద చెన్నూర్ నియోజకవర్గంలో రెండు విడతల్లో 5,500 ఇళ్ల ను మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. చెన్నూర్లో 5 పడకల డయాలసిస్ కేంద్రం, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. అలాగే రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపట్టి సుమారు 2వేల మంది విద్యార్థులకు విద్య అందించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మైనింగ్ ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణకు, ప్రకృతి పరిరక్షణకు హరితహారం వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి గడ్డం వివేకానంద మందమర్రిలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ను సందర్శించి జర్మన్ భాషా శిక్షణ తరగతుల నిర్వహణను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.







# పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సిద్ధం కావాలి

## ఇచ్చోడలో కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్ల శిక్షణా శిబిరం

## ఆడే గజేందర్



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ స్థాయి ఏజెంట్ల (BLA–2) కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఈనెల 13న మధ్యాహ్నం ఒంటి గంటకు ఇచ్చోడ మండల కేంద్రంలోని గంగారెడ్డి గార్డెన్లో నిర్వహించనున్నట్లు బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ తెలిపారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమానికి పీసీసీ ట్రైనర్ రాథోడ్ నరేష్ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు మార్గ నిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ అమలు విధానం, ఓటర్ల జాబితాలో సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, బూత్ స్థాయి నిర్వహణలో పాటించాల్సిన విధానాలు, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే వ్యూహాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. బూత్ స్థాయి ఏజెంట్లు పార్టీకి వెన్నెముకలాంటివారని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల BLA–2లు తప్పనిసరిగా ఈ శిక్షణా శిబిరానికి హాజరై పార్టీ విజయానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

# రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి





**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం బోయపల్లి బోర్డ్ సమీపంలో గల జాతీయ రహదారిపై గురువారం ఒంటి గంట ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ ముస్కే రాజశేఖర్ (19 )మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ కు చెందిన TS19TA –0821, బొల్లి తిరుపతికి చెందిన మరో ట్రాక్టర్ TS 20T–1386 రెండు ట్రాక్టర్లు మంచిర్యాల ముల్కల ఆన్లైన్ ఇసుక కోసం వెళ్తున్న క్రమంలో బోయపల్లి బోర్డ్ సమీపంలో గల జాతీయ రహదారిపై వెనుక వస్తున్న ఆసిఫాబాద్ వైపు నుంచి మంచిర్యాలకు వెళ్తున్న TG15T –0777 నంబర్ గల లారీ అతివేగం, అజాగ్రత్తగా ట్రాక్టర్ ను వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో ముందు ఉన్న ట్రాక్టర్ను ఢీకొని కింద పడటంతో ముస్కే రాజశేఖర్ తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. అతివేగం, అజాగ్రత్తగా లారీని నడిపి ట్రాక్టర్ ప్రమాదానికి, ట్రాక్టర్ డ్రైవర్ మృతికి కారణమైన లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వివరించారు.

# బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువుల పంపిణీ



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కుంచావెల్లి గ్రామానికి చెందిన నల్లి నానయ్య– దుర్గక్క దంపతుల అల్లుడు టేకం మల్లేష్ ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ సర్ కుంచావెల్లి టీం సభ్యులు గురువారం పరామర్శించారు. కుటుంబం ఆర్థికంగా వెనుకబడిన పరిస్థితిలో ఉండటంతో మూడవ రోజు కార్యక్రమంలో భాగంగా నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ అవసరాల కోసం 25 కిలోల బియ్యం, 11 కిలోల చికెన్, 5 లీటర్ల వంటనూనెతో పాటు గ్లాసులు, ప్లేట్లను పంపిణీ చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచి మానవతా దృక్పథంతో సహాయం అందించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్లిష్ట సమయంలో మనోధైర్యంతో ముందుకు సాగాలని ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులు సహాయం అందించిన ఆర్ఎస్ ప్రవీణ్ సర్ కుంచావెల్లి టీంకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఈ నెల 13న కాంగ్రెస్ బీఎల్ఏ-2లకు ప్రత్యేక శిక్షణ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏ-2) కోసం ఈనెల 13న ప్రత్యేక శిక్షణా నిర్వ హించనున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ తెలిపారు. టీపీసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గ సమావేశం ఉదయం 10 గంటలకు కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో, బోథ్ నియోజకవర్గ సమావేశం మధ్యాహ్నం ఒంటి గంటకు ఇచ్చోడలోని గంగారెడ్డి గార్డెన్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పీసీసీ ట్రైనర్ రాథోడ్ నరేష్ ముఖ్య అతిథిగా హాజరై బూత్ స్థాయి నిర్వహణ, ఓటర్ల జాబితా పరిశీలన, ఎస్ఐఆర్ కార్యక్రమం అమలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అసెంబ్లీ ఇంచార్జులు, మండల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, బీఎల్ఏ-2లు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా విఠల్ బాధ్యతల స్వీకరణ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా పదోన్నతి పొందిన విఠల్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి సమక్షంలో విఠల్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నూతన సెక్రటరీగా విఠల్ మార్కెట్ కమిటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం సెక్రెటరి విఠల్ మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు, మార్కెట్ కమిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, మార్కెట్ కమిటీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఆజమ్ అలీ, మార్కెట్ కమిటీ సిబ్బంది, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# వాంకిడి మండలంలో పోలీసుల విస్తృత తనిఖీలు

## గంజాయి విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం



**ఉద్యమ కెరటం, వాంకిడి:** జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు మండలంలోని బానర్ కోసరా, చిన్న వాంకిడి గ్రామాల్లో గురువారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో వాంకిడి సీఐ, ఎస్సైతో పాటు పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం పాల్గొన్నారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు, వినియోగాన్ని అరికట్టే ందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, వినియోగించినా, గంజాయి మొక్కలను పెంచినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. ఇళ్లలో గంజాయి



నిల్వ ఉంచడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఇతర చట్ట విరుద్ధకార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులకు గంజాయి, మాదకద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనం గడపాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# వేంసూరు మండలంలో గాలివాన బీభత్సం

- పిడుగుపాటు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.
- గాలి ధాటికి ఎగిరిపోయిన ధాన్యం గోదాం రేకులు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వేంసూరు మండలంలో గురువారం గాలి వాన బీభత్సం సృష్టించింది. మండలంలోని లచ్చన్నగూడెం గ్రామంలో ఇళ్ల సమీపంలో ఉన్న తాటి చెట్టుపై పిడుగు పడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. మర్లపాడు గ్రామంలో ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇదిలా ఉండగా, మర్లపాడు గ్రామ సమీపంలో ఓ విద్యుత్ స్తంభం విరిగి పడుతున్న సమయంలో అక్కడి నుంచి బైక్పై వెళ్తున్న యువకులు అప్రమత్తమై వెంటనే బైక్పై నుంచి దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటన స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. అలాగే వేంసూరు మండల పరిధిలోని భీమవరం గ్రామంలో ఉన్న దేవిక మోడ్రన్ రైస్ మిల్లు వద్ద కూడా గాలివాన తీవ్ర ప్రభావం చూపింది. రేషన్ బియ్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి సరఫరా చేసే ఈ మిల్లు వద్ద కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ధాన్యం నిల్వ గోదాంపై అమర్చిన హైగ్రేడ్ క్వాలిటీ రేకులు ఈదురుగాలుల ధాటికి ఎగిరిపోయాయి. దీంతో గోదాంలో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడిసి పాడవుతుందనే ఆందోళన నెలకొంది. రేకులు ఎగిరిపోవడంతో ధాన్యాన్ని కాపాడేందుకు అత్యవసరంగా పరదాలు కప్పినప్పటికీ, భారీ గాలులు, వర్షం కారణంగా పూర్తిస్థాయిలో రక్షించలేకపోయామని మిల్లు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం. మరోవైపు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పలు గ్రామాల్లో రాత్రి పూట విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో చంటి పిల్లలు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉక్కపోత, చీకటి కారణంగా ప్రజలు రాత్రంతా అవస్థలు పడ్డారు. విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరాయంగా శ్రమించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. గాలివాన కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి పడటం, విద్యుత్ అంతరాయం ఏర్పడటం, ధాన్యం నిల్వలకు నష్టం వాటిల్లడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పిడుగులు, ఈదురుగాలుల సమయంలో అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# 15లోగా పెన్షన్దారులు లైవ్ ఫోటో క్యాప్చరింగ్ పూర్తి చేసుకోవాలి

- మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్ట ణంలోని వృద్ధాప్య, వికలాంగుల, వితంతు, ఒంటరి మహిళా పెన్షన్దారులు ఈనెల 15వ తేదీలోపు తప్పనిసరిగా లైవ్ ఫోటో క్యాప్చరింగ్ చేయించుకోవాలని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియను ప్రతి పెన్షన్దారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలో మొత్తం 13,476 పెన్షన్లు ఉండగా, ఇప్పటివరకు 9,451 మంది లైవ్ ఫోటో క్యాప్చరింగ్ పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఇంకా 4,025 మంది ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందన్నారు. లైవ్ ఫోటో క్యాప్చరింగ్ చేయించుకోని పక్షంలో భవిష్యత్తులో పెన్షన్ పంపిణీలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్పష్టం చేశారు. పెన్షన్దారులు తమ పరిధిలోని వార్డు ఆఫీసర్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఆర్పీలు, మెప్మా అధికారులు, మున్సిపల్ కార్యాలయం, డీఆర్డీఏ కార్యాలయాలను సంప్రదించి వెంటనే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం చేపట్టిన ఎస్ఐఆర్ ఫోటో ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. 2002 ఓటరు జాబితాలో ఉన్న కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను ఇంటింటికి వచ్చే ఎన్యుమరేటర్లు, వార్డు ఆఫీసర్లు , బీఎల్ఓలకు అందించి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను



విజయవంతం చేయాలని కోరారు.

# జొన్నల కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేసిన ప్రభుత్వం

- మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ

**ఉద్యమ కెరటం, బోథ్:** రైతుల నుంచి జొన్నల కొనుగోలు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసిందని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ తెలిపారు. లారీల కొరత, మార్కెట్కు భారీగా జొన్నలు వచ్చిన పరిస్థి తుల్లోకూడా ప్రాథమిక సహకార సంఘం, లారీ అసోసియేషన్, హమాలీల సహకారంతో కొనుగోళ్లు, తరలింపు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల విమర్శలను పక్కనబెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా రైతులకు మద్దతు ధర కల్పిస్తూ జొన్నల కొనుగోళ్లు చేపట్టి ందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఫలితాన్నిచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాత వైఖరితో పనిచేస్తోందని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా జొన్న రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్తో పాటు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ను తొలగించాలని ఆదివాసి సంఘాల ధర్నా

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ ఎస్బీఐ బ్యాంక్ ఫీల్డ్ అసిస్టెంట్ను వెంటనే తొలగించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్లవాయి సార్మేడి గేడం గణపత్ మాట్లాడుతూ గత ఆరు నెలలుగా గిరిజన రైతులు క్రాప్ లోన్ల కోసం బ్యాంక్ను ఆశ్రయిస్తున్నప్పటికీ ఫీల్డ్ అసిస్టె ంట్ వివిధ కారణాలు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అందిస్తున్న పంట రుణాల మంజూరులో కూడా అనవసర జాప్యం జరుగుతోందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులకు సకాలంలో క్రాప్ లోన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టె ంట్ను వెంటనే తొలగించి ఆయన స్థానంలో మరో అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి అధికారులు స్పందించకపోతే ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని



హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆత్రం అనంతరావు, ఆదివాసి సంఘాల నాయకులు మేశ్రం సేకు, కొడప ఆనందరావు, మడవి నాగరావు, మహిళా రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాల్లో పాఠకులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

- పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లా లోని గ్రంథాలయాల్లో పాఠకులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్తో కలిసి సందర్శించారు. గ్రంథాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న మూత్రశాలల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లా డుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, అధ్యయన సామాగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే తాగునీరు, విద్యుత్ సరఫరా, పరిశుభ్రమైన మూత్రశాలలు, పాఠకులకు అవసరమైన ఇతర సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్తో కలిసి స్టేషన్ రోడ్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, గుత్తేదారులతో సమన్వయం చేసుకుంటూ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రత్యేక సమగ్ర సవరణ పారదర్శకంగా చేపట్టాలి

**జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**



**ఉద్యమ కెరటం, తాండూర్:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం తాండూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బూత్ స్థాయి ఏజెంట్ల శిక్షణ కార్యక్రమానికి మండల తహశీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపు ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహనతో పనిచేసి ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపర్చడంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. ఓటర్ల వివరాల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 'ప్రధానమంత్రి పోషణ్' పథకం శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. మండలంలోని ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన వంట సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణలో పాల్గొని పరిశుభ్రత, రుచికరమైన, నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. వంట కార్మికుల సమస్యలు, పాఠశాలల అవసరాలు, ఎదురవుతున్న సవాళ్లపై వివరాలు తెలుసుకొని సంబంధిత అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల ప్రవేశాల పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పాఠశాలల అభివృద్ధిని సామూహిక బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీఓ పి.శ్రీనివాస్, మండల విద్యాధికారి దుర్గం శ్రీనివాస్, ఎంపీఓ జి.అనిల్ కుమార్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని కూనీ చేస్తున్న బీజేపీ

- **ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని దిగజారుడు రాజకీయాలు: ఆడే గజేందర్**

**ఉద్యమ కెరటం, బోథ్:** దేశంలో భారతీయ జనతా పార్టీ రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తూ, పౌరుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై గురువారం ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘాన్ని అడ్డు పెట్టుకుని బీజేపీ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీనాక్షి నటరాజన్ సమర్పించిన అఫిడవిట్లో ఎలాంటి సాంకేతిక, చట్టపరమైన లోపాలు లేవని పేర్కొన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీ నేతలు ఫిర్యాదులు చేసి నామినేషన్ తిరస్కరణకు కుట్ర పన్నారని ఆరోపించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని అన్నారు. ఒక్క రాజ్యసభ స్థానం కోసం ఇంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం బీజేపీ తీరుకు నిదర్శనమని విమర్శించారు. ఇలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని, ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం అన్ని చట్టబద్ధ వేదికలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ బీజేపీ విధానాలకు



వ్యతిరేకంగా గళమెత్తాలని పిలుపునిచ్చారు.

# ఆహార భద్రతలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఆహార భద్రత విషయంలో ప్రతిఒక్కరూ నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను ఆహార భద్రత శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని



సూచించారు. ఆహార వ్యాపార సంస్థల్లో గడువు ముగిసిన ఆహార పదార్థాలు గుర్తిస్తే పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు నాణ్యమైన ఆహారం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్ల కు ఎఫ్ఎస్ఎస్ఏఐ నమోదు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆహార భద్రత శాఖ అధికారి వాసురాం, సంబంధిత శాఖల అధికారులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఇంటింటికి నిరంతర తాగునీటి సరఫరా లక్ష్యంగా చేపట్టిన అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద జరుగుతున్న పనులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సరఫరా సంబంధిత పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించడమే అమృత్ 2.0 పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార చర్యలపై ప్రజారోగ్య శాఖ ఈఈ, డీఈఈలతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. శాఖల మధ్య సమన్వయం పెంచి, అవసరమైన యంత్రాంగం, సిబ్బందిని అందుబాటులో ఉంచి పనులను వేగవంతం చేయాలని సూచించారు. అమృత్ 2.0 పనులతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో



బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్పర్సన్, ప్రజారోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే లక్ష్యం... ఇబ్రహీంపల్లిలో మెగా ఉచిత వైద్య శిబిరం

- **కాంటినెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు**

**ఉద్యమ కెరటం, ఉమ్మడి రంగారెడ్డి / చేవెళ్ల**

ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు ఇబ్రహీంపల్లిలో ఫైండ్ల గోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం కాంటినెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ జగదీష్ కుమార్ నేతృత్వంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్పర్సన్ శిబిరాన్ని పరిశీలించి వైద్య సేవలను అభినందించారు. ఈ సందర్భంగా వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు సుమారు 150 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ఆరోగ్య సూచనలు అందించారు. రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు, కంటి వ్యాధులు మరియు సాధారణ ఆరోగ్య పరీక్షలను నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణే ప్రధాన లక్ష్యంగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను గ్రామీణ ప్రజలకు అందించాలనే సంకల్పంతో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఇలాంటి శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వార్డు కౌన్సిలర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, వైద్య బృందం సభ్యులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్.వి. మోడల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ర్యాంకు

**ఉద్యమ కెరటం, మిర్యాలగూడ**

పట్టణంలోని ఎస్.వి.మోడల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి, 470 మార్కులకుగాను 468 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు పొందింది. విద్యార్థిని సాధించిన ఈ ఘన విజయం పాఠశాలకు, తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు గర్వకారణమని పాఠశాల ప్రతినిధి ఓరుగంటి శ్యామ్ సుందర్ తెలిపారు. విద్యార్థిని కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల సమర్థవంతమైన మార్గదర్శకత్వం, అలాగే తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ అద్భుత విజయాన్ని సాధించగలిగిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# బస్వాపూర్‌లో చిటుకు వ్యాధితో 60 గొర్రెల మృతి



**ఉద్యమ కెరటం, భిక్కనూరు**

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో చిటుకు వ్యాధి కారణంగా సుమారు 60 గొర్రెలు మృతి చెందడంతో తీవ్ర కలకలం రేగింది. కందూరి సాయిలుకు చెందిన గొర్రెల మందలో ఈ వ్యాధి వ్యాపించడంతో భారీ నష్టం వాటిల్లింది. జీవనాధారమైన గొర్రెలను కోల్పోవడంతో బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఫోన్ ద్వారా బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బాధితుడికి ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.జిల్లా పశువైద్యాధికారి భరత్ కుమార్, తహసీల్దార్ సునీత, పశువైద్య సిబ్బంది మౌనిక, దేవేందర్ తదితర అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి చిటుకు వ్యాధి వ్యాప్తిపై వివరాలు సేకరిస్తున్నారు. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# బత్తాయి నిమ్మ రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి

- **రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తాం**
- **టిఆర్ఎస్ పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత**



**ఉద్యమ కెరటం, మాడుగులప**

మండలంలోని ఇందుగుల గ్రామంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత బత్తాయి తోటలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు సమస్యలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో స్థానిక రైతులు, బత్తాయి రైతుల ఇబ్బందులను వివరించడంతో, వారి పరిస్థితిని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఆమె గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బత్తాయి రైతులతో మాట్లాడి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. నల్గొండ జిల్లాలో బత్తాయి, నిమ్మ, పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసిన కవిత, ముఖ్యమంత్రి ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి, పంటలకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బత్తాయి రైతుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారి తరపున పోరాటం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

# మురుగు నిరుతో కంపు కొడుతున్న తూప్రాన్ ప్రధాన రహదారి ...

- **నెలల తరబడి మురుగు నీరు పారుతున్న పట్టించుకోరు మున్సిపల్ అధికారులు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పై పలు అనుమానాలు....**

**ఉద్యమ కెరటం, తూప్రాన్**



తూప్రాన్ మున్సిపల్ పట్టణ ప్రధాన రహదారి పై మురుగు పారుతున్న పట్టించుకొని మున్సిపల్ అధికారులు. తూప్రాన్ నడివోడ్డున అమ్మ హాస్పిటల్ బిల్డింగ్ యాజమాన్యం వారు ఇష్టను రీతిలో డ్రైనేజ్ మురుగు నీరు ని రోడ్డు పై గత కొన్ని నెలలుగా వదిలి పెడుతుండడంతో కాలి నడకన వెళ్లే వారు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ఇది ఎక్కడో కదొండోయ్ మున్సిపల్ కార్యాలయనికి కూతవేటు దూరంలోనే డ్రైనేజ్ నీరు పారుతుండడం గమనార్హం, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఎంతో గొప్పగా నిర్వహిస్తుంటే తూప్రాన్ లో మాత్రం అందుకు భిన్నంగా మున్సిపల్ అధికారులు ప్రవర్తిస్తున్నారు,పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం అని గొప్పలు చెప్పుకునే నాయకులకు, అధికారులకు అమ్మ హాస్పిటల్ వారు మురుగు నీరు ని రోడ్డుపై వదిలి పెడుతున్న ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రజల్లో పలు అనుమానాలు కలిగిస్తున్నాయి. మురుగునీరు రోడ్డుపై పారుతుండడంతో దుర్వాసన వెదజల్లి ఈగలు,దోమలు పెరిగి రోగాల బారిన పడే దుస్థితి నెలకొందని, ఈ విషయమై పలుమార్లు సమ్మెకు అధికారులకు చెప్పిన ఎవరు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆలోచించారు, ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు, నాయకులు పట్టించుకుని డ్రైనేజ్ మురికి నీరును రోడ్డుపై వదిలిపెడుతున్న వారిపై చర్యలు తీసుకోని ములుగు ప్రవహిస్తున్న షాపుల ముందు శానిటేషన్ చేపించి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు.

# 350 పరుగుల లక్ష్యం!

## ఆఫ్ఘన్ ముందు భారత్ భారీ స్కోరు




ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 49 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 349 పరుగులు చేసింది. దీంతో ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు విజయానికి 350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు ముందుగా భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడాడు. కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించినప్పటికీ అనూహ్యంగా ఔటయ్యాడు. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 84 పరుగులు సాధించాడు. మధ్య వరుసలో రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు బలమైన పునాది వేశారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును ముందుకు నడిపించారు. చివర్లో సూర్యాంశ్ షెడ్జ్ వేగంగా పరుగులు సాధించి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. 27 బంతుల్లో 40 పరుగులు చేసి జట్టు స్కోరు బోర్డును పరుగెత్తించాడు. భారత్-ఏ తరఫున ప్రభుసిమ్రన్ సింగ్, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ అర్ధశతకాలతో మెరిశారు. ఆఫ్ఘనిస్తాన్-ఏ బౌలర్లలో అబ్దుల్లా అహ్మద్‌జాయ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 5 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటికే శ్రీలంక-ఏపై జరిగిన తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత్-ఏ జట్టు, ఈ మ్యాచ్‌లో కూడా ఆధిపత్యం చాటేందుకు సిద్ధమవుతోంది. ఇక 350 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు ఎలా ఛేదిస్తుందో ఆసక్తికరంగా మారింది.

## ఆస్ట్రేలియా జట్టులో భారత క్రికెటర్..! 60 ఏళ్ల తర్వాత అరుదైన ఘనత



భారత సంతతికి చెందిన క్రికెటర్ నిఖిల్ చౌదరీ ఆస్ట్రేలియా జాతీయ జట్టులో చోటు దక్కించుకుని అరుదైన ఘనత సాధించాడు. బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఎంపికైన నిఖిల్, తుది జట్టులో అవకాశం దక్కితే వచ్చే వారం అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరఫున అరంగేట్రం చేయనున్నాడు. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత భారత మూలాలు కలిగిన ఓ పురుష క్రికెటర్ ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో ఈ ఎంపికకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం నిఖిల్ హోబార్ట్ హరికేన్స్ జట్టు తరఫున దేశీయ క్రికెట్ ఆడుతున్నాడు. ఇటీవల బెల్జియంలో జరుగుతున్న ఈయూ20 పోటీల్లో జేబీ బ్రూగ్స్ జట్టు తరఫున కూడా అతను ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఎడమచేతి స్పిన్ బౌలర్‌గా గుర్తింపు పొందిన నిఖిల్ అవసరమైన సమయంలో విలువైన పరుగులు చేయగల సమర్థుడైన బ్యాటర్ కూడా. బంగ్లాదేశ్‌తో జూన్ 17 నుంచి 21 వరకు జరిగే టీ20 సిరీస్‌లో మధ్యవరుస స్థానం కోసం జోయెల్ డేవిస్, ఆరన్ హార్డీతో నిఖిల్ పోటీ పడనున్నాడు. బిగ్ బాష్ లీగ్‌లో అతను కనబర్చిన అద్భుత ప్రదర్శనను దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసినట్లు ఆస్ట్రేలియా ఎంపిక కమిటీ వెల్లడించింది. గతంలో కూడా భారత సంతతికి చెందిన కొందరు ఆటగాళ్లు ఆస్ట్రేలియా తరఫున ఆడారు. అయితే వారిలో ఎక్కువ మంది 1960ల కంటే ముందు జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. చివరిసారిగా 1964లో భారత మూలాలు కలిగిన రెక్స్ సెల్లార్స్ ఆస్ట్రేలియా తరఫున ఆడినట్లు రికార్డులు చెబుతున్నాయి. 30 ఏళ్ల నిఖిల్ చౌదరీ ఢిల్లీలో జన్మించాడు. భారతదేశంలో పంజాబ్ తరఫున 14 జాబితా-ఏ మ్యాచ్‌లు ఆడిన అనుభవం అతనికి ఉంది. కరోనా కాలంలో ఆస్ట్రేలియాలోని తన బంధువుల వద్దకు వెళ్లిన నిఖిల్ అక్కడే క్రికెట్ కొనసాగించాడు. అనంతరం దేశీయ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శనతో గుర్తింపు తెచ్చుకున్నాడు. గత బిగ్ బాష్ సీజన్‌లో 307 పరుగులు చేసి హోబార్ట్ హరికేన్స్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు ఆస్ట్రేలియా జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడంతో అతని క్రికెట్ ప్రయాణం కొత్త మలుపు తిరిగింది. అభిమానులు అతని అరంగేట్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## 350 పరుగుల లక్ష్యం..! ఆఫ్ఘన్ ముందు భారత్ భారీ స్కోరు



**న్యూఢిల్లీ, మే 23 :** ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 49 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 349 పరుగులు చేసింది. దీంతో ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు విజయానికి 350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు ముందుగా భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడాడు. కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించినప్పటికీ అనూహ్యంగా ఔటయ్యాడు. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 84 పరుగులు సాధించాడు. మధ్య వరుసలో రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు బలమైన పునాది వేశారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును ముందుకు నడిపించారు. చివర్లో సూర్యాంశ్ షెడ్జ్ వేగంగా పరుగులు సాధించి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. 27 బంతుల్లో 40 పరుగులు చేసి జట్టు స్కోరు బోర్డును పరుగెత్తించాడు. భారత్-ఏ తరఫున ప్రభుసిమ్రన్ సింగ్, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ అర్ధశతకాలతో మెరిశారు. ఆఫ్ఘనిస్తాన్-ఏ బౌలర్లలో అబ్దుల్లా అహ్మద్‌జాయ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 5 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటికే శ్రీలంక-ఏపై జరిగిన తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత్-ఏ జట్టు, ఈ మ్యాచ్‌లో కూడా ఆధిపత్యం చాటేందుకు సిద్ధమవుతోంది. ఇక 350 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు ఎలా ఛేదిస్తుందో ఆసక్తికరంగా మారింది.

## ప్రపంచకప్‌కు వీడ్కోలు చెప్పనున్న దిగ్గజాలు..! ఇదే చివరి పోరు



ఫిఫా ప్రపంచకప్ 2026 ప్రారంభానికి రంగం సిద్ధమవుతున్న వేళ ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ మెగా టోర్నీ కేవలం ప్రపంచ విజేతను నిర్ణయించడమే కాకుండా ఓ స్వర్ణయుగానికి ముగింపు పలకనుంది. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ ఫుట్‌బాల్‌ను శాసించిన పలువురు దిగ్గజ ఆటగాళ్లకు ఇదే చివరి ప్రపంచకప్‌గా నిలిచే అవకాశం ఉంది. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఇప్పటికే ప్రపంచకప్ గెలిచి తన కలను సాకారం చేసుకున్నాడు. 2022లో జట్టుకు టైటిల్ అందించిన మెస్సీ, ఇప్పుడు వం-సగా రెండోసారి అర్జెంటీనాను విజేతగా నిలపాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాడు. ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందిన మెస్సీకి ఇది చివరి ప్రపంచకప్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు మాత్రం ప్రపంచకప్ ఇంకా అందని కలగానే మిగిలిపోయింది. ఎన్నో రికార్డులు, ట్రోఫీలు గెలిచిన రొనాల్డో తన కెరీర్‌లో ప్రపంచకప్‌ను మాత్రమే అందుకోలేకపోయాడు. 41 ఏళ్ల వయసులో బరిలోకి దిగుతున్న అతనికి ఈ టోర్నీ చివరి అవకాశం కానుంది. క్రొయేషియా దిగ్గజం లూకా మోడ్రిచ్ కూడా తన చివరి ప్రపంచకప్ ఆడనున్నాడు. 2018లో జట్టును ఫైనల్‌కు చేర్చిన మోడ్రిచ్, ఇప్పటికీ క్రొయేషియా జట్టుకు కీలక శక్తిగా కొనసాగుతున్నాడు. ఈ టోర్నీతో అతని అద్భుతమైన అంతర్జాతీయ కెరీర్ ముగిసే అవకాశం ఉంది. జర్మనీ స్టార్ థామస్ ముల్లర్ కూడా చివరిసారి ప్రపంచకప్ వేదికపై కనిపించనున్నాడు. 2014లో జర్మనీ విజయంలో కీలక పాత్ర పోషించిన ముల్లర్, తన అనుభవంతో మరోసారి జట్టుకు సేవలందించేందుకు సిద్ధమయ్యాడు. బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్ ఇప్పటికే 2026 ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని సంకేతాలు ఇచ్చాడు. బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచిన నెయ్‌మార్, ఆరో ప్రపంచకప్ టైటిల్‌ను దేశానికి అందించాలనే లక్ష్యంతో చివరిసారి బరిలోకి దిగనున్నాడు. మెస్సీ, రొనాల్డో, మోడ్రిచ్, ముల్లర్, నెయ్‌మార్ వంటి దిగ్గజాల కోసం ఈ ప్రపంచకప్ మరింత ప్రత్యేకంగా మారింది. ప్రపంచ విజేత ఎవరో తేలడమే కాకుండా, ఫుట్‌బాల్ చరిత్రలో ఓ గొప్ప తరం ఆటగాళ్లకు వీడ్కోలు పలికే వేదికగా కూడా ఈ టోర్నీ నిలవనుంది.

## 2027 ప్రపంచకప్‌కు రోహిత్, కోహ్లీ అవసరం!

### రైనా అభిప్రాయం

2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవం ఎంతో కీలకమని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అభిప్రాయపడ్డాడు. యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు అండగా ఉంటే జట్టు మరింత బలంగా మారుతుందని పేర్కొన్నాడు. పెద్ద టోర్నీల్లో అనుభవం అత్యంత ముఖ్యమని రైనా చెప్పాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే ఇరవై ఓవర్ల, టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికి ప్రస్తుతం వన్డేలపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. ప్రపంచకప్‌లలో ఈ ఇద్దరికీ అద్భుతమైన రికార్డులు ఉన్నాయని గుర్తు చేశాడు 2019 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ అత్యధిక పరుగులు సాధించగా, 2023 ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ టోర్నీ అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడని రైనా వివరించాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిర్వహించే ప్రధాన టోర్నీల్లో విజయం సాధించిన అనుభవం వారికి ఉందని, కీలక నాకౌట్ మ్యాచ్‌ల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో వారికి బాగా తెలుసని చెప్పాడు. అలాంటి ఆటగాళ్లు జట్టులో ఉండటం యువ క్రికెటర్లకు కూడా ఎంతో ఉపయోగకరమని రైనా అభిప్రాయపడ్డాడు. శుభ్‌మన్ గిల్ తొలిసారి ప్రపంచకప్‌లో భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో రోహిత్, కోహ్లీ సలహాలు అతడికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నాడు. ఇదే సమయంలో మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే కూడా గిల్‌పై ప్రశంసలు కురిపించాడు. నాయకత్వ బాధ్యతలు వచ్చినప్పటికీ గిల్ బ్యాటింగ్‌పై ఎలాంటి ప్రభావం పడలేదని అన్నాడు. ఇటీవల జరిగిన లీగ్ పోటీల్లో కూడా అతడు ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ అద్భుత ప్రదర్శన చేశాడని కొనియాడాడు. గిల్‌కు అనుభవజ్ఞులైన ఆటగాళ్ల మద్దతు ఉండటం పెద్ద బలమని కుంబ్లే పేర్కొన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి ఆటగాళ్లు మైదానంలో ఉండటం వల్ల ఫీల్డింగ్ అమరికలు, బౌలింగ్ మార్పులు, వ్యూహాత్మక నిర్ణయాల్లో యువ కెప్టెన్‌కు సహకారం అందుతుందని చెప్పాడు. అందువల్ల నాయకత్వ బాధ్యతల భారం పూర్తిగా గిల్‌పైనే పడదని, సీనియర్ల అనుభవం భారత జట్టుకు 2027 ప్రపంచకప్‌లో కీలకంగా మారే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## వింబుల్డన్‌లో రికార్డు బహుమతి..! విజేతకు రూ.40 కోట్లు

ప్రపంచ ప్రఖ్యాత వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో ఈసారి రికార్డు స్థాయిలో బహుమతి నగదును ప్రకటించారు. పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 48 లక్షల డాలర్ల బహుమతి అందించనుండగా, ఇది భారత కరెన్సీలో సుమారు రూ.40 కోట్లకు సమానం. టోర్నీ తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన ఆటగాళ్లకు కూడా కనీసంగా 80 వేల పౌండ్ల పారితోషికం అందించనున్నారు.



అర్హత పోటీల కోసం సుమారు 60 లక్షల పౌండ్లను కేటాయించిన నిర్వాహకులు, గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెంపు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మొత్తం బహుమతి నగదు 64.2 మిలియన్ పౌండ్లకు చేరుకుంది. వింబుల్డన్ చరిత్రలోనే ఇదే అత్యధిక బహుమతి నగదని నిర్వాహకులు వెల్లడించారు. ఆల్ ఇంగ్లండ్ క్లబ్ చైర్ దెబోరా జీవన్స్ మాట్లాడుతూ ఆటగాళ్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రౌండ్లలోనూ పారితోషికాలను పెంచినట్లు తెలిపారు. టోర్నీ ఆదాయంలో మరింత వాటా ఆటగాళ్లకు ఇవ్వాలన్న డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో బహుమతి నగదు 9.5 శాతం పెరిగినప్పటికీ, పలువురు ఆటగాళ్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు నిరసనలు కూడా చేపట్టారు. గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో బహుమతి నగదు 20 శాతం పెంచగా, ఈ ఏడాది వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. గత ఏడాది వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విభాగంలో జానిక్ సిన్నర్ విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియాటెక్ టైటిల్ కైవసం చేసుకుంది. ఈసారి రికార్డు స్థాయి బహుమతులతో వింబుల్డన్ మరింత ఆసక్తికరంగా మారనుంది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
12 జూన్ 2026



# ఉత్తరాంధ్రలో పెద్ది దూకుడు!

## తొలి వారంలో రామ్‌చరణ్‌కు భారీ వసూళ్లు

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ కథానా యికగా నటించిన పెద్ది బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిం చిన ఈ మల్టీ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతోంది. ప్రత్యేకంగా ఉత్త రాంధ్ర ప్రాంతంలో 'పెద్ది'కి విశేష స్పందన లభిస్తు న్నట్లుట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మాస్ ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ చిత్రం అక్కడి ప్రధాన కేంద్రాల్లో బలమైన వసూళ్లను నమోదు చేస్తోంది. టికెట్ ధరలు అధికంగా ఉన్నప్పటికీ ప్రేక్షకుల ఆదరణ ఏమాత్రం తగ్గకపోవడం విశేషంగా మారింది. తొలి వారం ప్రదర్శన పూర్తయ్యేసరికి ఉత్తరాంధ్రలో ఈ చిత్రం రూ.18 కోట్లకు పైగా షేర్‌ను (జీఎస్టీతో కలిపి) రాబట్టి నట్లుసినీ వర్గాల్లో ప్ర చారం జరుగుతోంది. ఈ ప్రాంతంలో నమోదైన అత్యధిక షేర్ వసూళ్లలో ఇది రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాల మధ్య విడుదలైన 'పెద్ది' తెలుగు రాష్ట్రా ల్లోమంచి వసూళ్లతో దూసుకెళ్తు ండగా, ఉత్తరాంధ్రలో సాధించిన ఈ కలెక్షన్లు చిత్ర విజయానికి మరింత బలం చేకూర్చాయి. 'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్‌చరణ్‌కు మరోసారి ఉత్త రాంధ్ర ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని సినీ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

# 'సింగ్ గీతం'పై చిరంజీవి ప్రశంసలు

## సింగీతం గారే తెలుగు సినిమా భీష్మాచార్యుడు'



మెగాస్టార్ చిరంజీవి దర్శక దిగ్గజం సింగీతం శ్రీనివాసరావుపై ప్రశంసల వర్షం కురిపించారు. 94 ఏళ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు రూపొందించిన ప్రయోగాత్మక చిత్రం సింగ్ గీతం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా చిత్రబృందానికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో చేసిన పోస్టులో చిరంజీవి మాట్లాడుతూ.. సింగీతం శ్రీనివాసరావు తెలుగు సినీ పరిశ్రమకు ఒక ఆస్తి, అపురూపమైన నిధి అని కొనియాడారు. దర్శకుడిగా ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించడమే కాకుండా, పలువురు కళాకారులకు అవకాశాలు కల్పించి వారి జీవితాలకు మార్గదర్శకుడిగా నిలిచారని పేర్కొన్నారు. ''తెలుగు సినిమా పరిశ్రమకు సింగీతం గారు భీష్మాచార్యుడు లాంటి వ్యక్తి. ఆయన దర్శకత్వంలో రూపొందిన 'సింగ్ గీతం' మరో మైలురాయి చిత్రంగా నిలవాలని, ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని చిరంజీవి అన్నారు. అలాగే ఈ చిత్రాన్ని నిర్మించిన నాగ్ అశ్విన్ను ప్రత్యేకంగా అభినందించారు. సీనియర్ తరానికి ప్రతినిధిగా సింగీతం, కొత్త తర ఆలోచనలకు ప్రతిరూపంగా నాగ్ అశ్విన్ కలిసి పనిచేయడం సినీ పరిశ్రమకు స్ఫూర్తి దాయకమని వ్యాఖ్యానించారు. చిత్రానికి సంగీతం అందించిన దేవి శ్రీ ప్రసాద్పై కూడా ప్రశంసలు వ్యక్తం చేశారు. కాగా, అయాన్, అహల్య, శాలిని ప్రధాన పాత్రల్లో నటించిన 'సింగ్ గీతం' ఓ వినూత్న కథాంశంతో తెరకెక్కింది. ఒక గ్రామ ప్రజలు ఎదుర్కొనే విచిత్రమైన సమస్య చుట్టూ కథ తిరుగుతుంది. అనూహ్య పరిణామాల వల్ల గ్రామస్థుల సాధారణ మాటలన్నీ పాటలుగా మారిపోవడంతో వారు పడే గందరగోళం, ఆ సమస్యకు పరిష్కారం వెతికే ప్రయత్నాలను వినోదాత్మకంగా చిత్రంలో చూపించారు. ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తి స్తున్న ఈ చిత్రం జూన్ 12న విడుదల కానుంది.

## ఆకట్టుకుంటున్న దీవాన



యువ నటులు హర్షిత్, స్నేహ ప్రధాన పాత్రల్లో నటించిన దీవాన ప్రేక్షకుల ముం దుకు రావడానికి సిద్ధమవుతోంది. దర్శ కుడు శ్రీకాంత్ తెరకెక్కించిన ఈ చిత్రం జూన్ 19న విడుదల కానుం ది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రేమ, భావోద్వేగాలు, యువతను ఆకట్టు కునే అంశాలతో రూపొందిన ఈ ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ట్రైలర్‌లో వినిపించిన ''చచ్చేంత ప్రేమ లేకపోతే అది ప్రేమే కాదు'' మరియు ''ఎంత గొప్ప ప్రేమకథ అయినా వన్‌సైడ్ లవ్‌తోనే మొ దలవుతుంది'' వంటి డైలాగులు యువతకు బాగా కనెక్ట్ అవుతున్నాయి. ప్రేమ లోని భావోద్వేగాలను, యువత మనస్తత్వాన్ని ప్రతిబింబించేలా ఈ సంభాషణలు ఉండటం విశేషం.

# 'ధురంధర్' మేకింగ్ అద్భుతం : పవన్ కల్యాణ్



ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్ కళ్యాణ్ ఇటీవల విడుదలై విజయవం తమైన ధురంధర్, బారాముల్లా చిత్రాలపై ప్రశంసలు కురిపించారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ రెండు సినిమాల గురించి తన అభిప్రా యాలను వెల్లడించారు. 'ధురంధర్' తొలి భాగం తనకు ఎంతో నచ్చిందని పవన్ తెలిపారు. కథను ఎంతో ధైర్యంగా, ప్రభావవంతంగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. ముఖ్యంగా దర్శకుడు కథను తెరపై చూపించిన తీరు, మేకింగ్ శైలి ఆకట్టుకుందని ప్రశంసించారు. అయితే బిజీ షెడ్యూల్ కారణంగా 'ధురంధర్ 2'ను ఇంకా చూడలేకపోయినట్లు చెప్పారు. ''హారర్ సినిమాలు ప్రేక్షకుడిని పూర్తిగా కథలో ముంచెత్తుతాయి. నాకు నిద్ర రాకపోతే కూడా అలాంటి చిత్రాలే చూస్తుంటాను. కశ్మీర్ నేపథ్యంలో రూపొందిన 'బారాముల్లా' నాకు అక్కడ గడిపిన రోజులను గుర్తుచేసింది. 1987 నుంచి 1989 మధ్యకాలంలో పలుమార్లు కశ్మీర్‌కు వెళ్లాను. అప్పట్లో అక్కడి పరిస్థితులను, ప్రజలు ఎదుర్కొన్న కష్టా లను ప్రత్యక్షంగా చూశాను. ముఖ్యంగా కశ్మీరీ పండిట్లు అనుభవించిన బాధలు నన్ను కలిచివేశాయి. ఆ భావోద్వేగాలే 'బారాముల్లా ' చిత్రంతో నన్ను మరింత అనుబంధం కలిగించాయి'' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తి కరంగా మారాయి.



# దర్శకుడు సంజీవ్ మేగోటి వాఖ్యలపై వరలక్ష్మి కౌంటర్

నటి వరలక్ష్మి శరత్‌కుమార్‌పై దర్శకుడు సంజీవ్ మేగోటి చేసిన ఆరోపణలు ఇటీవల సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆయన దర్శకత్వంలో రూపొందిన పోలీస్ కంప్లైంట్ ఈ నెల 12న విడుదల కానున్న నేపథ్యంలో, సినిమా ప్రచార కార్యక్రమాల్లో వరలక్ష్మి పాల్గొనలేదని, పారితోషికం తీసుకున్నప్పటికీ ఇంటర్వ్యూలు ఇవ్వలేదని సంజీవ్ ఆరోపించారు.ఈ ఆరోపణలపై తాజాగా స్పందించిన వరలక్ష్మి , తాను చిత్రబృందానికి అవసరమైన ప్రతి సందర్భంలో అందుబాటులో ఉన్నానని స్పష్టం చేశారు. సినిమా సంబంధిత కార్యక్రమాలకు హాజరయ్యానని, తాను చేయాల్సిన బాధ్యతలను నిర్వర్తించానని తెలిపారు. ''ఆ వేడుకలో దర్శకుడు ఏమి మాట్లాడారో నాకు పూర్తిగా తెలియదు. కొన్ని విషయాల్లో నాకు నా స్వంత అభిప్రాయాలు ఉంటాయి. అందుకే ఈ అంశంపై బహిరంగ వాదోపవాదాలకు దిగాలని అనుకోవడం లేదు'' అని ఆమె పేర్కొన్నారు. ఈ వివాదాన్ని మరింత పెంచే ఉద్దేశం తనకు లేదని కూడా స్పష్టం చేశారు. ఇక తాను ఇతరుల మాదిరిగా ఆరోపణలు చేస్తూ తిరగనని, తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగుతానని ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ నోట్ ద్వారా వెల్లడించారు. దీంతో ఈ వివాదానికి తెరదించే ప్రయత్నం చేసినట్లైంది. కాగా, ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, వరలక్ష్మి ప్రమోషన్లకు సహకరించకపోవడం వల్ల సినిమాకు నష్టం జరిగిందని, డబ్బింగ్ సమయంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీయగా, తాజాగా వరలక్ష్మి స్పందనతో వివాదం మరో మలుపు తిరిగింది.



## డిసెంబర్‌లోనే 'రాకా' రిలీజ్?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, ప్రముఖ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం రాకాపై సినీ వర్గాల్లో ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకా'ను వచ్చే ఏడాది డిసెంబర్ తొలి వారంలో విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రానప్పటికీ, విడుదల తేదీపై ఇప్పటికే చర్చ మొదలైంది. ఇప్పటి వరకు రిలీజైన సినిమాలతో అల్లు అర్జున్ కెరీర్‌లో డిసెంబర్ నెల ప్రత్యేకంగా నిలిచింది.

# పూజా హెగ్డేకు మళ్లీ నిరాశే!

ఒకప్పుడు టాలీవుడ్‌లో అగ్ర హీరోల సరసన నటిస్తూ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డేకు ఇటీవల కాలంలో ఆశించిన విజయాలు దక్కడం లేదు. వరుస పరాజయాల నేపథ్యంలో తెలుగు చిత్రాలకు దూరమైన ఆమె, ప్రస్తుతం బాలీవుడ్ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఈ క్రమంలో వరుణ్ ధావన్ హీరోగా తెరకెక్కిన హై జవానీ తో ఇష్క్ హోనా హైపై పూజా హెగ్డే భారీ ఆశలు పెట్టుకున్నారు. ఈ చిత్రం విజయవంతమైతే బాలీవుడ్‌లో తన కెరీర్‌కు కొత్త ఊపు వస్తుందని భావించారు. అయితే, విడుదలైన తర్వాత ఈ సినిమా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. వీకెండ్‌లో సాధారణ స్థాయి వసూళ్లు నమోదు చేసిన ఈ చిత్రం, ఆ తర్వాత కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ప్రదర్శన చేయలేకపోయిందని సమాచారం. దీంతో పూజా హెగ్డేకు ఈ ఫలితం నిరాశ కలిగించినట్లుగా సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా, ఈ చిత్రంలో మరో కథానాయికగా నటించిన మృణాల్ ఠాకూర్కు కూడా బాలీవుడ్‌లో పెద్ద విజయాలు దక్కలేదు. తెలుగులో పలు విజయవంతమైన చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న మృణాల్, హిందీ చిత్రసీమలో మాత్రం ఇప్పటికీ బలమైన స్థానం కోసం ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి సమయంలో 'హై జవానీ తో ఇష్క్ హోనా హై' ఆశించిన ఫలితం సాధించకపోవడం పూజా హెగ్డే, మృణాల్ ఠాకూర్‌ల కెరీర్‌లకు మరో సవాలుగా మారిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అయితే, ఇద్దరు నటీమణులూ ప్రస్తుతం పలు కొత్త ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటంతో రానున్న చిత్రాలపై వారి అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**